తొలిరోజు నిరాషా..!



పాత ధరలతో.. పాత మందు విక్రయం

నిలదీసిన మద్యం ప్రియులు.. సర్దిచెప్పిన వ్యాపారులు

త్వరలో ధరలు తగ్గి.. కొత్త మద్యం వచ్చే అవకాశం

- 136 దుకాణాలకు 47 మాత్రమే ప్రారంభం

పాత మద్యమే..

వైసీపీ హయాంలో డిస్టిలరీ నుంచి సరఫరా అయిన పాత మద్యాన్నే ప్రైవేటు మద్యం దుకాణాలలో విక్రయిస్తున్నారు. గతంలో కొన్ని బ్రాండ్లనే విక్రయించే వారు. ప్రస్తుతం దాదాపు అన్ని బ్రాండ్లను అందుబాటులో ఉంచారు. ఎక్సైజ్ శాఖ రాష్ట్ర స్థాయి అధికారులు మద్యం ధరల పట్టికను జిల్లాకు పంపారు. ఆ పట్టిక సోషల్ మీడియాలోనూ హల్ చల్ చేసింది. అందులో అన్ని బ్రాండ్ల క్వార్టర్ బాటిళ్ల ధరలు పాతవే కనిపించాయి. కొన్ని బ్రాండ్ల ధరలను హాఫ్ బాటిల్‌పై గతంతో పోలిస్తే రూ.10 తగ్గించారు. రెండు రకాల కొత్త బ్రాండ్లు అందుబాటులోకి వచ్చాయి. వారం, పది రోజుల్లో కొత్త మద్యం, కొత్త ధరలు అందుబాటులోకి వస్తాయని ఎక్సైజ్ శాఖ అధికారులు అంటున్నారు.

అనంతపురం అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలు తొలిరోజు బుధవారం అనుకున్న స్థాయిలో ప్రారంభం కాలేదు. కొత్త బ్రాండ్లు వచ్చాయని, ధరలు తగ్గించారని భావించిన మద్యం ప్రియులు కొత్త దుకాణాలకు క్యూకట్టారు. కానీ పాత ధర వసూలు చేయడంతో తీవ్ర నిరాశకు లోనయ్యారు. క్వార్టర్ మద్యం రూ.99కే దొరుకుతుందని భావించినా.. ఇంకా అమలులోకి రాలేదు. అన్ని బ్రాండ్ల మద్యం పాత ధరలకే అమ్మడంతో కొందరు ప్రశ్నించారు. ధరలు తగ్గిస్తామని, నాణ్యమైన మద్యం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. వ్యాపారులను నిలదీశారు. ప్రస్తుతానికి పాత ధరలే ఉన్నాయని, త్వరలో ధరలు తగ్గించే అవకాశం ఉందని వ్యాపారులు చెప్పడంతో ఉత్త చేతులతో వెనుదిరగలేక ఎప్పటిలాగే భారీగా ధరలు వెచ్చించి కొనుగోలు చేశారు.



షాపుల వద్ద మద్యం ప్రియుల సందడి

- **తొలిరోజు 47 దుకాణాలే..**

జిల్లా వ్యాప్తంగా 136 ప్రైవేటు మద్యం దుకాణాలను కేటాయించారు. వీటిని బుధవారం నుంచి ప్రారంభించాలని ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదేశించారు. కానీ తొలి రోజు 47 దుకాణాలను మాత్రమే తెరిచారు. అనంతపురం నగరంలో 30 మద్యం దుకాణాలకు గానూ తొమ్మిది మాత్రమే మొదలయ్యాయి. దుకాణాల నిర్వహణ కోసం గదులను అద్దెకు తీసుకునే ప్రయత్నాలు సాగుతున్నాయి. గతంతో పోలిస్తే రెట్టింపు అద్దె చెబుతుండటంతో వ్యాపారులు ఆలోచనలో పడినట్లు సమాచారం. అనుకూలమైన ప్రాంతంలో, సరైన అద్దెకు గదులు దొరుకుతాయేమోనని ప్రయత్నిస్తున్నారు. మరికొందరు అద్దె ఎక్కువైనా వ్యాపారాన్ని దృష్టిలో ఉంచుకుని అడిగినంత చెల్లించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. తొలి రోజు తక్కువగా దుకాణాలను తెరవడంతో మద్యం ప్రియులు ఇబ్బంది పడ్డారు. మరికొందరు బార్ అండ్ రెస్టారెంట్లకు వెళ్లి మద్యం సేవించారు.



పాత ధరే ఉండంటూ మద్యం బాటిల్‌ను చూపుతున్న మద్యం ప్రియుడు

మందు సందడి..

యాడికి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని కొత్త మద్యం దుకాణాలు బుధవారం మద్యం ప్రియులతో కిటకిటలాడాయి. కావాల్సిన బ్రాండ్లు లభిస్తున్నాయని తెలిసి కొనుగోలుదారులు బారులుతీరారు. యాడికిలో టీడీపీ వర్గీయులు, వైసీపీ వర్గీయులు ఒక్కో మద్యం దుకాణాన్ని తెరిచారు. వైసీపీ వర్గీయుల మద్యం దుకాణం విషయంలో వివాదం నెలకొనడంతో గొడవలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. గుంపులుగా ఉన్నవారిని చెదరగొట్టారు. యూపీఎస్ సీఐ ఈరన్న, యాడికి సీఐ రామసుబ్బయ్య బందోబస్తును పర్యవేక్షించారు.



యాడికిలో వైన్‌షాపు వద్ద సందడి

బెల్టు కోసం పైరవీలు

యల్లనూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుతో బెల్టు షాపుల అంశం తెరపైకి వచ్చింది. గ్రామాల్లో మద్యం అమ్మేందుకు చాలామంది పైరవీలు నడిపిస్తున్నారు. బెల్టు షాపుల నిర్వహణకు తమకే అవకాశం ఇప్పించాలని పలువురు గ్రామీణ ప్రాంత నాయకులు ముఖ్య నాయకుల నుంచి ఫోన్‌లు చేయిస్తున్నారు. గతంలో మాదిరిగానే అన్ని గ్రామాల్లో బెల్ట్‌షాపులు ఏర్పాటు చేస్తారనే ప్రచారం నేపథ్యంలో వాటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే గ్రామాల్లో అక్రమంగా మద్యం వ్యాపారం కొనసాగిస్తున్న వారు ఎలాగైనా బెల్టు షాపులు దక్కించుకోవాలని ముఖ్య నాయకుల ఇళ్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

లోతట్టు ప్రాంతాలపై నిఘా వేయండి

- డీపీఓ నాగరాజనాయుడు



గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న డీపీఓ నాగరాజనాయుడు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను డీపీఓ నాగరాజనాయుడు ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలపై నిఘా వేయాలని సూచించారు. డీపీఓ నుంచి ఎంపీడీఓలు, ఈఓఆర్డీలతో బుధవారం గూగుల్ మీట్ నిర్వహించారు. వర్షంతో ఎర్పడే ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయించాలని, ఫిల్టరేషన్, క్లోరినేషన్ సక్రమంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. అవసరమైతే సూపర్ క్లోరినేషన్ చేయాలని అన్నారు. ముంపు ముప్పు ఉండే ప్రాంతాలను గుర్తించి, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. అనంతపురం రూరల్ పరిధిలోని కక్కలపల్లి, కక్కలపల్లి కాలనీ, రుద్రంపేట, రాజీవ్‌కాలనీ, తడకలేరు తదితర ప్రాంతాల్లో ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్తా చెదారం, ముళ్ల పొదలను తొలగించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.





ANANTAPURMU MUNICIPAL CORPORATION

'e' Procurement-Tender Notice.

1	Tender Notice No	115 to 117/2024-25/General Funds/TO
2	Name of Work	Providing of B.T. Patches in Ananthapuramu Municipa Corporation
3	Estimate Cost Ranging	Rs.7.50 Lakhs to Rs.9.00 Lakhs
4	Number of Tenders	3 Number of Works
5	Bid Document download Starting date	17-10-2024 @ 10.30 A.M
6	Bid Document ending date	21-10-2024 @ 5.00 P.M

Note: The details of tender may be seen on e-procurement market Place available @https://tender.apeprocurement.gov.in

Sd/- Commissioner,
Anantapuramu Municipal Corporation,

హితబోధా..? మందలింపా..?

- రేపు ఎంపీలు, ఎమ్మెల్యేలతో చంద్రబాబు సమావేశం 7

రూ. 2.5 కోట్లు.. చిన్న కథ కాదు

- లేనివి ఉన్నట్లు, వేయనివి వేసినట్లు..
- డీసీఈబీలో దృశ్యం సినిమా సీన్లు 6
- అక్రమ పద్ధతుల్లో ఫేక్ టెండర్ల డ్రామా

19న కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి

అనంతపురం న్యూటౌన్ అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఈ నెల 19న పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నామని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి తెలిపారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి వెంకట నరసింహులు సమావేశానికి వస్తారని ఆయన తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని అన్నారు. జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జులు, పోటీ చేసిన అభ్యర్థులు, మండల, పట్టణ అధ్యక్షులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, సేవాదళ్, కిసాన్ సెల్ నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు, ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా విభాగం నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

నూతన సాంకేతికతతో పర్యావరణ పరిరక్షణ

జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు



మాట్లాడుతున్న వీసీ సుదర్శన రావు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టాలని జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు పిలుపునిచ్చారు. వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో 'మెంబ్రేన్ ప్రాసెస్ ఫర్ ఎ గ్రీన్ ఎన్విరాన్‌మెంట్ కరెంట్ స్టేటస్, ఛాలెంజెస్ అండ్ ఫ్యూచర్ ప్రాస్పెక్ట్స్' అనే అంశంపై మూడురోజుల అంతర్జాతీయ సదస్సును బుధవారం ప్రారంభించారు. కన్వీనర్ ప్రొఫెసర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ చెన్నారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు వీసీ, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, ఐఎంఎస్ ప్రెసిడెంట్ సీఎన్ మూర్తి, సీఆర్ఆర్ఐ చీఫ్ సైంటిస్ట్ శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మనం చేసే ప్రతి పని కారణంగా పర్యావరణంలో మార్పులు వస్తుంటాయని వీసీ అన్నారు. అలాగని పనులు చేయకుండా ఉండలేమని, మార్పులు లేకుండా మెంబ్రేన్ టెక్నాలజీని ఉపయోగించాలని సూచించారు. పర్యావరణ మార్పులకు అనుగుణంగా సింథటిక్, న్యాచురల్ లేయర్స్‌ను వినియోగించే విధానాన్ని పరిశోధించాలని సూచించారు. ఈ అంశాలపై మూడురోజులపాటు శాస్త్రవేత్తలు చర్చించి ఒక పరిష్కారాన్ని కనుగొనేందుకు కృషి చేస్తుండటం అభినందనీయమని అన్నారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్‌లు దిలీప్‌కుమార్, విశాలి గోర్వాడే, విష్ణువర్ధన్, హేమచంద్రారెడ్డి, విభాగాధిపతులు కళ్యాణిరాధ, అజిత, నారాయణరెడ్డి, సుచిత్ర, శివశంకర్, ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధాకర్ బాబు పాల్గొన్నారు.







న్యూస్ బాక్స్

మళ్లీ ఆయనే..

అనంతపురం అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశుగణాభి వృది సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఈఓ)గా సుధాకర్‌ను కొనసాగిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పశుసంవర్ధక శాఖ డీడీ సుధాకర్ ప్రస్తుతం పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. మరో ఏడాదిపాటు ఆయన్ను ఆ సంస్థలో ఈఓగా కొనసాగిస్తూ పశుసంవర్ధక శాఖ డైరెక్టరేట్ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

జిల్లాకు డీఏపీ సరఫరా

అనంతపురం అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1340 మెట్రిక్ టన్నుల డీఏపీ సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇందులో 50 శాతం డీఏపీని మార్క్‌ఫెడ్‌కు కేటాయించినట్లు తెలిపారు.

ఇళ్ల మధ్యలో మద్యం దుకాణాలు వద్దు: ఐద్వా

అనంతపురం కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు నివసించే చోట మద్యం దుకాణాలు పెట్టవద్దు అని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి బుధవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే మద్యాన్ని నియంత్రించాలని ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం ఖాతరు చేయకుండా విచ్చలవిడిగా మద్యం షాపులు పెడుతోందని విమర్శించారు. రాత్రి 10 గంటల వరకు దుకాణాలు తెరిచి ఉంచితే మహిళలు ఇబ్బంది పడతారని, దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. ఇప్పటికైనా గుడి, బడి, మహిళలు ఇబ్బంది పడే ప్రాంతాల్లో మద్యం షాపులు పెట్టకుండా ఎక్సైజ్ శాఖ కమిషనర్, సూపరింటెండెంట్‌లు చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనసాగిన పప్పుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో పప్పుశనగ పంపిణీ ప్రక్రియ బుధవారం రెండో రోజు కొనసాగింది. ఇప్పటి దాకా 11890 క్వింటాళ్ల పప్పుశనగ పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటి దాకా 13561 మంది రైతులు 19059 క్వింటాళ్ల పప్పుశనగ కోసం తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

50కిలోలు ఇవ్వాలి: రైతు సంఘం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎకరాకు 50 కిలోల చొప్పున రైతులకు పప్పుశనగ అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి సంయుక్త ప్రకటనలో బుధవారం డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎకరాకు 40కిలోలు ఇస్తామని ప్రకటించిందని, అయితే కొన్ని గ్రామాల్లో రైతుసేవా కేంద్రం అధికారులు ఎకరాకు 20కిలోలు మాత్రమే ఇస్తూ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నార న్నారు. అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2023 రబీలో అతివృష్టి, అనావృష్టి కారణంగా సాగుచేసిన పంటలు పూర్తిగా నష్టపోవడంతో రైతులు అప్పుల్లో కూరుకుపోయారన్నారు. కాబట్టి రైతులకు ఎకరాకు 50కిలోల పప్పుశనగ అందజేయాలని కోరారు.

నర్సుల సంఘం ఎన్నికలకు 21 నామినేషన్లు

అనంతపురం టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నర్సుల జిల్లా అసోసియేషన్ ఎన్నికలకు బుధవారం ఐఎంఏ హాల్‌లో నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. ఎన్నికల అధికారి చంద్రశేఖర్ బరిలో ఉన్న అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. మొత్తం 21 నామినేషన్లు వచ్చాయి. ఇందు లో అధ్యక్ష స్థానానికి 03, వైస్‌ప్రెసిడెంట్‌కు 04, జిల్లా కార్యదర్శికి 03, కోశాధికారి పో స్టుకు04, ఎగ్జిక్యూటివ్ మెంబర్ స్థానానికి 07 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. నామినేషన్ల పరిశీలన గురువారం, ఉపసంహరణ శుక్రవారం, 23న ఎ న్నికలు ఉంటాయని ఆయన వెల్లడించారు.

నాణేలపై అవగాహన అవసరం - ఎల్‌డీఎం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నాణేలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని ఎల్‌డీఎం నర్సింగరావు తెలిపారు. రూ.10, ఇతర నాణేలపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు బుధవారం ఎల్‌డీఎం, కె నరాబ్యాంకు ఆధ్వర్యంలో నగరంలోని హోటళ్లు, బ్యాంకులు, తోపుడుబండ్లు, వ్యా పార సముదాయాల్లో అవగాహన కల్పించారు. రూ.10నాణేలపై అపోహలు సరికాదని, ఎక్కడైనా వినియోగించవచ్చని తెలిపారు. అనంతరం పలువురు వ్యాపారులకు నాణేలను పంపిణీ చేశారు. ఈ కా ర్యక్రమంలో కెనరాబ్యాంకు డివిజనల్ మేనేజర్లు షేక్ మహబూబ్, సెంథిల్‌కుమార్, మేనేజర్ దివ్య, గోపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

జీడిపల్లికి 1047 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయరుకు 1047 క్యూసెక్కుల వరద వస్తోందని హంద్రీనీవా అధికారులు బుధవారం తెలిపారు. హంద్రీ నీవా ఫేజ్-2కు 955 క్యూసెక్కులు వదులుతున్నామని తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.642 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రూ. 2.5 కోట్లు చిన్న కథ కాదు

- లేనివి ఉన్నట్లు, వేయనివి వేసినట్లు..
- డీసీఈబీలో దృశ్యం సినిమా సీన్లు
- అక్రమ పద్ధతుల్లో ఫేక్ టెండర్ల డ్రామా
- రూ.2.5 కోట్ల ప్రశ్నపత్రాల పనుల్లో అక్రమాలు

జిల్లా సాధారణ పరీక్షల మండలిలో లేనివి ఉన్నట్లు, వేయని టెండర్లు వేసినట్లు సినిమాటిక్‌గా కథను నడిపారు. ఆఖరికి రబ్బర్ స్టాంపులు కూడా సృష్టించి కథ నడిపి రూ. 2.5 కోట్ల పనుల్లో భారీగా అక్రమాలకు పాల్పడ్డారు. ఈ ఎపిసోడ్‌లో పాత్రధారి, సూత్రధారి మొత్తం కథ నడిపితే వ్యవహారం మొత్తం తెలిసినా కమీషన్లు తీసుకుని మరో ఉన్నతాధికారి కూడా కళ్లు మూసుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. మొత్తంపై డీసీఈబీ స్కామ్‌లో తవ్వే కొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి.

- అనంతపురం విద్య(ఆంధ్రజ్యోతి)



డీసీఈబీ కార్యాలయం

టెండర్లు పిలవకుండానే పేపర్లు సరఫరా

2024-2025 విద్యా ఏడాదికి సంబంధించిన ప్రశ్నాపత్రాల సరఫరా, ఇతర పనుల నిమిత్తం ఇటీవల టెండర్లు పిలిచారు. గత నెల చివరల్లో టెండర్ నోటీసులు ఇస్తూ.... పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు. ఎక్కడైనా టెండర్లు ఓపెన్ చేసి న తర్వాత అర్హులను గుర్తించడం, తర్వాత టెండర్ దక్కించుకున్న వారితో అగ్రిమెంట్ చేసుకుంటారు. అగ్రిమెంట్ చేసుకున్న వాళ్లు పనులు చేస్తారు. ఈ ప్రొసీజర్ కామన్. అయితే సెప్టెంబరులో టెండరు కోసం ప్రకటనలు ఇచ్చారు. అయితే 2024-25విద్యా ఏడాదికి సంబంధించిన పనులు ఆగస్టులోనే ప్రారంభించారు. ఈ విద్యా ఏడాదికి సంబంధించిన ఎఫ్ఏ-1 ప్రశ్నాపత్రాలను ముద్రించి, సప్లై చేశారు. ఈ వర్కును అడ్డగోలుగా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నా యి. నిబంధనలకు విరుద్ధంగా గుట్టుగా ఈ టెండర్ తంతు సాగించినట్లు విమర్శలు వస్తున్నాయి.

అంతా దృశ్యమే !

డీసీఈబీలో 2024-25 విద్యా ఏడాది ఎఫ్ఏ-1,2,3,4, ఎస్ఏ-1, 2, ప్రశ్నాపత్రాలు ముద్రణ, సరఫరా, జవాబు పత్రాల స్కానింగ్ ఇతర పనులకు సంబంధించి రూ. 2.5 కోట్ల పనుల వెనుక భారీగా కథ నడిపినట్లు తెలుస్తోంది. ఈ పనులను విజయవాడ ప్రాంతానికి చెందిన కొన్ని ప్రింటర్స్‌కు అప్పగించడానికి జూన్, జూలై మాసాల్లోనే దృశ్యం సినిమా తరహాలో ఫేక్ ఎపిసోడ్స్ సాగించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. టెండర్ పిలిచినట్లు న్యూస్ పేపర్లలో ప్రకటనలు ఇవ్వడం, అవి ప్రింటర్స్ యజమానులు చూసి, టెండర్లు వేయడం, వాటిని ఓకే చేయడం, తర్వాత అగ్రిమెంట్ కుదుర్చుకోవడం తదితర పనులన్నీ నకిలీ డాక్యుమెంట్ల ద్వారా సాగించారన్న విమర్శలు వస్తున్నాయి. రబ్బర్ స్టాంపులు కూడా ఫేక్‌వి సృష్టించారన్న ఆరోపణలు వ స్తున్నాయి. తమకు అనుకూలమైన ముద్రణాలయాలకు గంపగుత్తగా పనులు కట్టబెట్టి, భారీగా గుడ్‌విల్ సొమ్ము లాగేసుకోడానికే ఈ తంతు సాగించినట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ వ్యవహారం వెనుక ఇద్దరు ఉన్నతాధికారులున్నట్లు తెలుస్తోంది.

టీచర్లయితే వెంటనే చర్యలు...

మరి డీసీఈబీ వ్యవహారం కనిపించదా..?

జిల్లా విద్యాశాఖ పరిధిలో పనిచేసే టీచర్లు చిన్న తప్పు చేసినా వెంటనే ఎలాంటి విచారణ చేయకుండా చర్యలు తీసుకుంటారు. సాయంత్రానికి సస్పెండ్ చేస్తారు. లేదా చార్జెస్ ఫ్రేం చేయడం వంటి చర్యలకు జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారి దిగుతున్నారు. మరి డీసీఈబీలో భారీగా నిధుల గోల్ మాల్ జరిగినా చర్యలు తీసుకోకపోవడంపై ఉపాధ్యా య సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పెదవి విరుస్తున్నారు. డీఈఓ ఫిబ్రవరిలో వస్తే...డిసెంబరులోనే ఆమె పేరుతో రూ. 31.80 లక్షల విలువైన పనులకు సంబంధించి న వర్క్ ఆర్డర్ నకిలీ ఉత్తర్వులు సృష్టించినా చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉండటంపై ఆరోపణలు వస్తున్నాయి.

విద్యాశాఖ అక్రమాలపై విచారణ చేయాలి



టీచర్ల విషయంలో ఏదైనా వివాదం ఏర్పడితే కనీసం విచారణ కూడా చేయకుండా పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సస్పెండ్ చేస్తారు. మూడు నెలల తర్వాత తీరిగ్గా విచారణ చేస్తారు. విషయం ఏమీ లేకపోతే అబ్బే ఏం లేదంటూ సస్పెన్షన్ ఎత్తివేస్తారు. అయితే మూడు, నాలుగు నెలలు మాత్రం టీచర్లను బాధపెడుతారు. అదే డీసీఈబీలో అక్రమాలు జరిగితే, డీఈఓ కింద పనిచేసే డీవైఈఓను విచారణాధికారిగా వేస్తే విచారణ ఎలా పారదర్శకంగా జరుగుతుంది. టీచర్లకు ఒక న్యాయం అధికారులకు ఒక న్యాయమా..?, అధికారులకు సీసీఏ రూల్స్ వర్తించవా? ఇదెక్కడి విడ్డూరం...? టీచర్ల రీప్పొట్రియేషన్‌లో కూడా చాలా అక్రమాలు జరిగాయి. డీఈఓను పక్కనబెట్టి విద్యాశాఖలో జరిగే అక్రమాలపై విచారణ చేయాలి.

- హరికృష్ణ, పోర్టో రాష్ట్ర చైర్మన్

డీఈఓపై విచారణ చేయాలి



జిల్లా విద్యాశాఖలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించే డీసీఈబీ అత్యంత కీలకమైనది. ఇందులో భారీగా నిధుల స్కాం జరిగినట్లు తేటతెల్లమవుతోంది. ఇన్ని అక్రమాలు జరిగినా ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారో వారికే తెలియాలి. అనంతపురం డీసీఈబీలో జరిగిన అక్రమాలపై విద్యాశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ, విద్యాశాఖ మంత్రి స్పందించాలి. డీఈఓపై కూడా విచారణ చేసి, చర్యలు తీసుకోవాలి.

- అశోక్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్ఆర్‌టీఏ

ఏర్పాట్లు పూర్తి

నేడు జిల్లాలో రాష్ట్రస్థాయి వాల్మీకి జయంతి

హాజరుకానున్న జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు



పాతూరులోని వాల్మీకి విగ్రహం వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్, బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ మల్లికార్జున తదితరులు

అనంతపురం అర్బన్/అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు16: రాష్ట్రస్థాయి వాల్మీకి జయంతి వేడుకలు జిల్లాలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలకు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. పాతూరులోని పవర్ ఆఫీసు వద్దనున్న వాల్మీకి విగ్రహానికి గురువారం ఉదయం 10 గంటలకు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. అనంతరం గుత్తిరోడ్డులోని మార్కెట్ యార్డు వద్దనున్న బళ్లా కన్వెన్షన్ హాల్‌లో జయంతి వేడుకలు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించనున్నారు.

ఘనంగా నిర్వహించాలి: కలెక్టర్ వినోద్‌కుమార్

జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ మల్లికార్జునతో కలిసి ఆయన పాతూరులోని వాల్మీకి విగ్రహం ప్రాంతం, బళ్లా కన్వెన్షన్ హాల్‌ను పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా వేడుకలు జరగాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయన వెంట బీసీ సంక్షేమశాఖ జేడీ ఉమాదేవి, డీడీ కుష్బూకొఠారీ, డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, తహసీల్దార్ హరికుమార్, జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య తదితరులు ఉన్నారు.

జయప్రదం చేద్దాం : అంబికా లక్ష్మీనారాయణ, ఎంపీ

వాల్మీకి జయంతి వేడుకలను జయప్రదం చేద్దామని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నగరంలోని గుత్తి రోడ్డు బళ్లా కన్వెన్షన్ హాల్‌లో గు రువారం ఉదయం 10 గంటలకు వాల్మీకి జయంతి నిర్వహిస్తామన్నారు. తొలుత పాతూరు పవర్ ఆఫీస్ వద్ద వాల్మీకి వి గ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పిస్తామని తెలిపా రు. వేడుకల్లో వాల్మీకి నాయకులు, ప్రజాప్రతినిధులు, వాల్మీకి బంధుమిత్రులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

చుక్కలు కనబడుతున్నాయ్..!

- ఫ్రీహోల్డ్ భూముల పునఃపరిశీలన
- వైసీపీ పాలనలో అక్రమాలపై యంత్రాంగం ఆరా
- 22-ఏ, చుక్కల భూముల వివరాలు కోరిన సీసీఎల్ఏ
- వణుకుతున్న రెవెన్యూ అక్రమార్కులు



కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయం

కళ్యాణదుర్గం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): భూముల విషయంలో జరిగిన అక్రమాలపై కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించడంతో అక్రమార్కుల గుండెల్లో దడ పుడుతోంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ అయిన ఫ్రీహోల్డ్ భూములే కాకుండా నిషేధిత జాబితా నుంచి తొలగించిన దానిపై పునఃపరిశీలన సాగుతోంది. ఈ నేపథ్యంలోనే కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లో 3203 మందికి చెందిన 12,393 ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించడంపై నీలినీడలు కమ్ముకున్నాయి. వైసీపీ పాలనలో జరిగిన భూ అక్రమాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలోనే ఐదేళ్లగా ఎన్ని ఎకరాల ప్రభుత్వ భూములకు పట్టాలిచ్చారు. చుక్కల భూములు ఎన్ని ఎకరాలు చక్కబెట్టారు. నిషేధిత జాబితా నుంచి ఎంత తొలగించారనే వివరాలను ఆరా తీసే పనిలో నిమగ్నమైంది.

అధికారులు, నాయకుల వాటాలు

అప్పట్లో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, కళ్యాణదుర్గంలో పనిచేసిన తహసీల్దార్లు, అధికార పార్టీ నాయకులు ప్రైవేటు వ్యక్తుల పేరిట పట్టాలు రాయించుకున్నారనే విమర్శలున్నాయి. ఇళ్ల పట్టాలను అక్రమమార్గంలో కొట్టేసి వాటిని విక్రయించి, వాటాలుగా పంచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఐదేళ్లలో చాలానే జరిగాయి. అప్పటి మంత్రి ఉష శ్రీచరణ్ కనుసన్నల్లో 22ఏ జాబితాపై ప్రత్యేక దృష్టి సారించి, అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్ చేయించారన్న విమర్శలు కూడా వినిపించాయి. అడిగినంత డబ్బు ఇస్తే ఎటువంటి ఆధారాలు లేకున్నా వాటిని ఆ జాబితా నుంచి తొలగించారు. కొందరు నేతలు సెటిల్‌మెంట్ భూములను 22ఏలోకి చేర్పించి భూ యజమానులను ముప్పతిప్పలు పెట్టి ముక్కుపిండి డబ్బు వసూలు చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. చుక్కల భూముల సమస్యలు పరిష్కరించేందుకు భారీగా డబ్బు తీసుకున్నారన్న ఆరోపణలు కూడా గుప్పుమంటున్నాయి.

ఆరా తీస్తున్న ప్రభుత్వం

సీసీఎల్ఏ అధికారులు ప్రధానంగా 22ఏ, చుక్కల భూముల నుంచి ఎన్ని ఎకరాలు తొలగించారు. ప్రభుత్వ, డీకేటీ భూముల్లో ఎన్ని ఎకరాలకు పట్టాలు ఇచ్చారు. ఫ్రీహోల్డ్‌గా ఎంత చేశారు. మాజీ సైనికులకు ఎంత భూమి ఇచ్చారన్న వివరాలపై ప్రభుత్వం ఆరా తీసే పనిలో నిమగ్నమైనట్లు తెలిసింది. వీటితో పాటు వ్యవసాయేతర భూమిగా ఎంత మార్చారనేది ప్రతి మండలం నుంచి నివేదిక కోరుతున్నట్లు తెలిసింది. ఇలా 2019 నుంచి 2024 జూలై 23 వరకు ఉన్న వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూమిలో జగనన్న కాలనీలకు ఎంత ఇచ్చారు. ఇతర అవసరాలకు ఎంత కేటాయించారో కూడా స్పష్టం చేయాలన్న వివరాలను కూడా ప్రభుత్వ యంత్రాంగం ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ముఖ్యంగా చుక్కల భూమి వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది.

వెలుగులోకి అప్పటి మంత్రి దందా !

చుక్కల భూముల వ్యవహారంలో అప్పటి మంత్రి ఉష శ్రీచరణ్ మొత్తం దందా సాగించినట్లు విమర్శలున్నాయి. ఆమె చెప్పినదానికి తల ఆడించే తహసీల్దార్లను నియోజకవర్గంలో నియమించుకుని అక్రమాలకు పాల్పడ్డారు. అధికారులను గుప్పిట్లో పెట్టుకుని వేల ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయించి, లక్షలాది రూపాయలు దండుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో చుక్కల భూముల దందాపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలిసింది. అవన్నీ ఇప్పుడు బయటకు వచ్చే అవకాశం ఉంది. దీంతో గత ఐదేళ్ల భూదోపిడీ కూడా బహిర్గతమయ్యే అవకాశం వుంది.

డబ్బులిస్తే చాలు

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. చుక్కల భూములను కూడా దర్జాగా డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అప్పటి మంత్రి ఉష శ్రీచరణ్ కనుసన్నల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయమంతా పనిచేసింది. అప్పటి ఒక సబ్ రిజిస్ట్రార్ ఆమెకు తొత్తుగా మారి, చుక్కల భూములు కూడా రిజిస్ట్రేషన్ చేయించారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రతి రోజు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వచ్చిన అక్రమ ఆదాయాన్ని వాటాలుగా పంచుకున్నట్లు తెలిసింది. ఈ విషయాలన్నింటిపై కూటమి ప్రభుత్వం ఆరా తీస్తుండటంతో అప్పటి అక్రమాల్లో పాలు పంచుకున్న సూత్రధారులు, పాత్రధారుల్లో ఆందోళన మొదలైంది.

వారంలో రెండు రోజులు

- పింఛన్ల మెడికల్ సర్టిఫికెట్ల మంజూరుకు కేటాయింపు
- జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు



అనంతపురం టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు అర్హత ఉండి, మెడికల్ సర్టిఫికెట్లు అవసరమైన వారి కోసం వారంలో రెండు రోజులు కేటాయించినట్లు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తలసేమియా, సికిల్‌సెల్ అనీమియా, హిమోఫిలియా, బోధకాలు, పక్షవాతం, ప్రమాదాలలో వీల్‌ఛైర్‌లకే పరిమితమైనవారు, డయాలసిస్, కిడ్నీ తొలగించుకున్నవారు, కుష్ఠువ్యాధి, గుండె, లివర్, కిడ్నీ మార్పిడి చేసుకున్నవారు మెడికల్‌బోర్డు సర్టిఫికెట్ దరకాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. వీరికి ప్రతి మంగళవారం, శుక్రవారం సర్టిఫికెట్ పొందే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆ రోజుల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆస్పత్రిలో సంబంధిత విభాగాల డాక్టర్లను సంప్రదించవచ్చన్నారు. ఈనిబంధనలు ఈనెల 22 తర్వాత నుంచి అమలులోకి వస్తాయన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయిజిల్లాలకు చెందిన వారు ఈ విషయాన్ని గమనించి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హంద్రీనీవా కాలువను డబుల్ చేయండి

మంత్రికి సీపీఐ రామకృష్ణ వినతి



నీటిపారుదలశాఖ మంత్రికి వినతిపత్రం ఇస్తున్న రామకృష్ణ

అనంతపురం విద్య, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువను రెండింతలు చేసి పూర్తిస్థాయిలో నీరు అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ నీటిపారుదల శాఖ మంత్రిని కోరారు. అమరావతిలో నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని బుధవారం ఆయన కలిసి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ తుంగభద్ర డ్యాంలో సమృద్ధిగా నీళ్లు ఉన్నాయన్నారు. డ్యాం నుంచి జిల్లా వాటాగా 32 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా, కేవలం 13 టీఎంసీలు మాత్రమే అందుతున్నాయ న్నారు. తుంగభద్ర డ్యాం అధికారులు నీళ్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ హెచ్చెల్సీ లైనింగ్ పనులు పూర్తికాకపోవడంతో జిల్లా ప్రజలు ఆశించి నా...నీరు అందే పరిస్థితి లేదన్నారు. 4 వేల క్యూసెక్కుల నీరు హెచ్చెల్సీ ద్వారా సరఫరా చేసేందులు అధికారులు సిద్ధంగా ఉన్నా కాలువ లైనింగ్ పూర్తికాకపోవడంతో 1800 క్యూసెక్కులు మాత్రమే ప్రవహిస్తున్నాయన్నారు. ప్రభుత్వం బడ్జెట్‌లో పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి, కాలువ లైనింగ్ పనులు పూర్తి చేసి, నీటిని విడుదల చేయాలన్నారు. శ్రీశైలం రిజర్వాయర్ నిండుకుండలా ఉన్నా రాయలసీమ జిల్లాలకు హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా పూర్తిస్థాయిలో నీళ్లు అందడం లేదన్నారు. ప్రభుత్వం హెచ్ఎన్ఎస్ఎస్‌ను రెండింతలు చేసి నీరు అందించాలని కోరారు.

రైతులపై వీఆర్వో చిందులు

కొత్తచెరువు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులపై మండలంలోని కొడపగానిపల్లి వీఆర్వో కాటమయ్య చిందులు తొక్కాడు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోనే రెచ్చిపోయాడు. తహసీల్దార్ ఎదుటే ఆగ్రహం వ్యక్తం చేశాడు. కొడపగానిపల్లికి చెందిన బాధిత రైతులు నవీన్, రామాంజి, సుబ్బరాయుడు, శివ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వీఆర్వో కాటమయ్య నేటికీ వైసీపీ సేవలోనే తరిస్తున్నాడని ఆరోపించారు. ఆ పార్టీ నాయకులు చెప్పిన వారికే ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారని మండిపడ్డారు. వీఆర్వో నిబంధనలకు విరుద్ధంగా 2010, 2015, 2023లో పట్టాలు పొందిన రైతులకు బోగస్ రికార్డులు సృష్టించి, ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనల మేరకు తమ భూములకు ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ చేయాలని వేడుకున్నా వినలేదని వాపోయారు. వైసీపీ నాయకుల ద్వారా ఫోన్ చేయిస్తే చేస్తానని ఖరాకండిగా చెప్పాడు. రైతు నవీన్ ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ చేయాలంటూ వీఆర్వో కాళ్లు పట్టుకున్నా కనికరించలేదు. రూ.50వేలు ఇస్తేనే చేస్తానన్నాడు. ఆ మొత్తం తనొక్కడికే కాదనీ, పైఅధికారులకు ఇవ్వాల్సి ఉంటుందని వీఆర్వో తెలిపాడు. దీంతో రైతులు బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి మూకుమ్మడిగా ఫిర్యాదు చేశారు. అక్కడికి వచ్చిన వీఆర్వో కాటమయ్య.. తహసీల్దార్ నీలకంఠారెడ్డి రైతులతో మాట్లాడుతుండగా.. వారిపై చిందులు తొక్కాడు. దీంతో తహసీల్దార్ నివ్వెరపోయాడు. తన ఎదుటే రైతులను ఇలా మాట్లాడడం ఏంటని మండిపడ్డారు. రైతులతో మాట్లాడే విధానం నేర్చుకోవాలంటూ మందలించారు. రైతుల ఫిర్యాదు మేరకు వీఆర్వో కాటమయ్య చేసిన ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లపై డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోతో క్షేత్రస్థాయిలో కమిటీ వేసి, విచారణ చేపడతామని తహసీల్దార్ తెలిపారు. దీంతో రైతులు వెళ్లిపోయారు.



తహసీల్దార్ ఎదుటే రైతులపై చిందులు తొక్కుతున్న వీఆర్వో కాటమయ్య (వృత్తంలో..)

అభివృద్ధి దిశగా అడుగులు

- పంచాయతీలకు పూర్వవైభవం!
- 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయింపునకు రంగం సిద్ధం
- ఏ పనులు చేపట్టాలన్న విషయంగా విధివిధానాలు ఖరారు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 16: గ్రామ పంచాయతీల అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పంచాయతీల వారిగా స్థితిగతులను సేకరించి అభివృద్ధి పనులు చేపట్టడానికి శ్రీకారం చుట్టింది. గత వైసీపీ పాలనలో కేంద్ర ఇచ్చిన నిధులు సైతం పంచాయతీలకు దక్కేవి కాదు. దీంతో పల్లె పాలకులు(సర్పంచ్‌లు) అభివృద్ధి విషయంగా ప్రజల మధ్యలో తలెత్తుకోలేని పరిస్థితి ఉండేది. ఈ విషయంలో వైసీపీ సానుభూతిపరులైన సర్పంచ్‌లు కూడా నానా ఇబ్బందులు పడ్డారు. అయితే కూటమి పార్టీలు అధికార పీఠంపై కొలువుదీరిన తర్వాత ముఖ్యంగా పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు తీసుకున్న డిప్యూటీ సీఎం గ్రామీణ సమస్యలపై దృష్టి సారించారు. ఈక్రమంలోనే సంబంధిత అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహించి పల్లె స్థితిగతులు తెలుసుకున్నారు. దీంతో గ్రామాలు అభివృద్ధి బాట పడతాయని పల్లె పాలకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈక్రమంలోనే కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులు జిల్లాల వారిగా విడుదలకు శ్రీకారం చుట్టడంతో సర్పంచ్‌ల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోగా, కేంద్రం కేటాయించిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8629 కోట్లు కూడా ఇతర పథకాలకు మళ్లించింది. దీంతో గ్రామాల్లో కనీసం వీధిలైట్లు కూడా వేయించలేని పరిస్థితి ఉందని సర్పంచ్‌లు వాపోయేవారు. ఉమ్మడి జిల్లాలో 1044 పంచాయతీలు ఉంటే ఇందులో 15 శాతం మాత్రమే టీడీపీ మద్దతుదారులున్నారు. మిగిలినవారంతా వైసీపీ సానుభూతిపరులే. అయినా వారు కూడా నిధులు లేక, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక నీరసించిపోయారు.

ప్రజాభిప్రాయం మేరకు అభివృద్ధి పనులు

కూటమి ప్రభుత్వం కొలువు తీరిన వంద రోజుల్లోనే పల్లె పాలకులు, ప్రజలు గత ఐదేళ్లలో అనుభవించిన కష్టాలను తరిమికొట్టేలా అభివృద్ధి పనులకు ప్రణాళికలు తయారు చేశారు. పంచాయతీల్లో ఎక్కడ, ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్న విషయంలో ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఆమేరకు సంబంధిత శాఖలు సంయుక్తంగా ఏ ఏ శాఖల నుంచి ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నది నిర్ణయించారు. ఒక శాఖ నుంచి చేసే అభివృద్ధి పని మరో శాఖ నుంచి చేపట్టడానికి వీలు లేకుండా చేశారు. స్థానిక ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి, మంచి జరిగేలా తగిన చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించి జిల్లా స్థాయి అధికారులు, మండల, పంచాయతీ అధికారులతో సమీక్షలు నిర్వహించి దిశనిర్దేశం చేశారు.

వాన వెల్లువ..

జిల్లావ్యాప్తంగా వర్షాలు

- ఉప్పొంగిన వాగులు, వంకలు
- నదులకు వరద
- తొలగించిన పంటలకు నష్టం



పరిగి వద్ద జయమంగళి నది ప్రవాహం

కొత్తచెరువు/పుట్టపర్తిరూరల్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా ఎడతెరపిలేకుండా వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం రోజంతా ఓ మోస్తారు వాన పడింది. దీంతో పలు వాగులు, వంకలు, కుంటలకు జలకళ వచ్చింది. జిల్లా ఎగువ ప్రాంతం కర్ణాటకలోని తుమకూరు జిల్లాలో కురిసిన వర్షాలకు జయమంగళి నది ఉధృతంగా ప్రవహించింది. పెన్నా నదిలోకి నీరు చేరింది. హిందూపురం-పరిగి మధ్య కాసేపు వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కర్ణాటకలో కురిసిన వర్షాలకు చిత్రావతి నదిలోకి నీరు చేరుతోంది. పుట్టపర్తిలో ప్రధాన రహదారి జలమయమైంది. ముదిగుబ్బ, ధర్మవరం, బుక్కపట్నంలో అధిక వర్షపాతం నమోదైంది. చిలమత్తూరులో 11.4 మి.మీ, అత్యల్ప వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా బుధవారం సాయంత్రానికి 846 మి.మీ, వర్షం కురిసింది.

జయమంగళికి జలకళ

పరిగి వద్ద జయమంగళి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అధికారులు.. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. నదికి ఉన్న గేట్లను ఎత్తి, దిగువకు నీటిని వదిలారు. అక్కడ పోలీసులు పహారా కాస్తున్నారు. చిత్రావతి నదికి వరద వస్తోంది. రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు జారీచేశారు. జిల్లాకేంద్రంతోపాటు ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాల్లో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.



నంబులపూలకుంట మండలంలో వర్షానికి తడిసిన వేరుశనగ కాయలు

తడిసిన పంటలు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు.. రైతన్నలకు నిద్రలేకుండా చేస్తున్నాయి. పొలాల్లో తొలగించిన పంటలు ప్రస్తుతం కురుస్తున్న పంటలకు దెబ్బతింటున్నాయి. వేరుశనగ కట్టె, దిగుబడి నల్లగా మారిపోతున్నాయి. దీంతో సర్వం నష్టపోతున్నామని అన్నదాతలు వాపోతున్నారు. ఈఏడాది వర్షాభావంతో దిగుబడి దారుణంగా పడిపోయింది. కనీసం పశుగ్రాసమైన దక్కుతుందనుకున్న రైతులకు నిరాశే మిగులుతోంది. దీంతో పెట్టుబడి కూడా కోల్పోతున్నామని రైతులు వాపోతున్నారు.



ముదిగుబ్బ మండలం ఈదులపల్లి వద్ద తడిసిన వేరుశనగ పంటను చూపుతున్న రైతు



శీరంగరాజులపల్లి వద్ద బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న జయమంగళి నది

అప్రమత్తంగా ఉండాలి..

గురువారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో కలెక్టర్ టీఎస్ చేతన్.. జిల్లావ్యాప్తంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముంపుప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు సూచించారు. భారీవర్షాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని ఎస్పీ రత్న.. పోలీసు అధికారులను ఆదేశించారు. వాగులు, వంకలు, నదుల సమీపానికి ప్రజలు వెళ్లకుండా భద్రత ఏర్పాటు చేయాలన్నారు.

జడి.. తడి

నేడు.. రేపు బలమైన గాలులతో వర్షం

వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి

అనంతపురం అర్బన్/బుక్కరాయసముద్రం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. పలు ప్రాంతాలలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం రోజంతా వర్షం కురుస్తోంది. జడి వానలకు వాగులు, వంకలు, కుంటలకు జలకళవచ్చింది. జిల్లాలోని అన్ని మండలాల్లో బుధవారం వర్షం కురిసింది. అత్యధికంగా కంబదూరులో 29.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. కుందుర్పి 26.8, వజ్రకరూరు 20.8, ఉరవకొండ 20.0, రాప్తాడు 19.2, కళ్యాణదుర్గం 18.8, ఆత్మకూరు 18.4, యల్లనూరు, శెట్టూరు 18.0, గుత్తి 16.8, పుట్లూరు 16.2, పామిడి, గుమ్మఘట్ట 15.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 15.0 మి.మీ.లోపు వర్షపాతం నమోదైంది. అనంతపురం నగరంలో మంగళవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ జడివాన కొనసాగింది. చల్లటి వాతావరణంలో వివిధ పనులు, విధులకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



అనంతలో..

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో గురు, శుక్రవారాల్లో ఉమ్మడి జిల్లాలో బలమైన గాలులుతో కూడిన వర్షం, పలు చోట్ల ఉరుములు, మెరుపులుతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి తెలిపారు.

నేడు.. రేపు..

నెల్లూరు ఆగ్నేయంగా 400 కి.మీ. దూరంలో వాయుగుండం కేంద్రీకృతమైందని తెలిపారు. ఇది పశ్చిమ వాయువ్య దిశగా పయనిస్తూ, పుదుచ్చేరి-నెల్లూరు మధ్య గురువారం తీరం దాటే అవకాశం ఉందని తెలిపారు. ఈ సమయంలో పలు చోట్ల ఉమ్మడి జిల్లాలో గంటకు 40-50 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, పలుచోట్ల ఉరుములతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నెల 23 వరకు వర్షం పడే అవకాశం ఉందని అన్నారు.

వైసీపీ నేత వైన్ షాపు

ధ్వంసం



ధ్వంసమైన మద్యం బాటిళ్లు

ధర్మవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో వైసీపీ నాయకుడు బాలిరెడ్డికి చెందిన వైన్‌షాపును మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. లక్కీడ్రాలో ధర్మవరం 7వ దుకాణాన్ని బాలిరెడ్డి దక్కించుకున్నారు. రాజీ ప్రయత్నాల కోసం కూటమి నాయకులు తనవద్దకు మధ్యవర్తిని పంపారని, దుకాణం ప్రారంభించిన తరువాత ఆలోచిద్దామని చెప్పానని బాలిరెడ్డి అన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వానికి డబ్బు చెల్లించానని, బుధవారం దుకాణాన్ని ప్రారంభించాలని మద్యం నిల్వలను తెచ్చుకున్నానని తెలిపారు. కూటమి నాయకులు మంగళవారం రాత్రి సెక్యూరిటీని బెదిరించి దుకాణంలోకి చొరబడ్డారని, మద్యం బాటిళ్లు, కంప్యూటర్, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారని ఆరోపించారు. మద్యం బాటిళ్లలో కొన్నింటిని ఎత్తుకుపోయారని అన్నారు. తనకు రూ.5 లక్షల వరకూ నష్టం జరిగిందని, పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. వైన్స్‌షాపును ధ్వంసం చేసిన ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

హితబోధా..? మందలింపా..?

రేపు ఎంపీలు, ఎమ్మెల్యేలతో చంద్రబాబు సమావేశం

- ప్రజాప్రతినిధుల పనితీరుపై పార్టీ నిఘావర్గాల నివేదిక
- ఇసుక, ఉద్యోగుల బదిలీలు, మద్యం సిండికేట్‌లపై ఫిర్యాదులు
- ఆరోపణలు ఎదుర్కొంటున్నవారితో చంద్రబాబు వన్ టు వన్



అనంతపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలు, రాజకీయ విశ్లేషకులు, మేధావి వర్గాలను ఆశ్చర్యపరిచే విధంగా గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంటు, 14 అసెంబ్లీ స్థానాలు దక్కాయి. ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఈ ఫలితాలు చారిత్రాత్మకం. వైసీపీ పాలనలో అరాచకాలు, ఆత్మహత్యాలు, విధ్వంసాలు, దౌర్జన్యాలకు ఓటర్లు చరమగీతం పాడుతూ కూటమికి ఉమ్మడి జిల్లా ప్రజానీకం ఈ స్థాయి విజయాన్ని ఇచ్చింది. ఈ నేపథ్యంలో ప్రజా సంక్షేమం, నియోజకవర్గాల అభివృద్ధిపై దృష్టిసారించాల్సిన గురుతర బాధ్యత కూటమి ప్రజాప్రతినిధులపై ఉంది. వైసీపీ పాలకుల తోవలోనే తాము నడుస్తామనే ధోరణికి స్వస్తి పలికి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే దిశగా ఎంపీలు, ఎమ్మెల్యేలు నడవాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్దేశం. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఆయన పదే పదే ఇదే అంశం చెబుతున్నారు. ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు తీసుకురావొద్దని హెచ్చరిస్తూనే ఉన్నారు. 'వైసీపీ నేతల తరహాలో బరితెగింపు వద్దు బ్రదర్' అని తనదైన శైలిలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలను హెచ్చరిస్తున్నారు. పార్టీకి, ప్రభుత్వానికి అప్రతిష్ఠ తెస్తే సహించేది లేదనే సంకేతాలను చంద్రబాబు పంపారు. ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి మద్యం టెండర్ల ప్రక్రియ పూర్తయ్యే వరకూ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులు, ముఖ్య అనుచరుల వ్యవహారశైలిని పార్టీ నిఘా వర్గాల ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి కూడా సమాచారం తెప్పించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేల కార్యకలాపాలపై ఇప్పటికే పార్టీ నిఘా వర్గాలు చంద్రబాబుతోపాటు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌కు నివేదిక అందినట్లు సమాచారం. ఈ నెల 18న మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించడానికి ఈ నివేదికే ప్రధాన కారణమని తెలుస్తోంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు సమావేశానికి రావాలని ఇప్పటికే ఆహ్వానాలు పంపినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

కొందరిపై ఫిర్యాదులు

ఉమ్మడి జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేల వ్యవహారశైలిపై ఆరోపణలు, విమర్శలతో కూడిన ఫిర్యాదులు అధిక సంఖ్యలో వెళ్లినట్లు నిఘావర్గాల ద్వారా తెలిసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లల్లో ఇసుక దందా, ఆ తరువాత ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్ల నియామకాల్లో కొందరు ఎమ్మెల్యేలు డబ్బు వసూలు చేయడం, ఉద్యోగుల బదిలీల్లో చేతివాటం, మద్యం దుకాణాలకు వేసిన దరఖాస్తుల్లో సిండికేట్ వ్యవహారాలు, బెదిరింపుల గురించి పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. ఆరోపణలు, విమర్శలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వన్ టు వన్ మాట్లాడుతారని సమాచారం. ఈ భేటీలో తనదైన శైలిలో చంద్రబాబు వారిని హెచ్చరించే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో నిర్వహిస్తున్న తొలి సమావేశం ఇది. ఆరోపణలు, విమర్శలు ఎదుర్కొంటున్నవారికి హితబోధ చేస్తారా..? మందలించి పంపుతారో చూడాలి మరి..!

టమోటా కిలో రూ.46



అనంతపురం రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా బుధవారం గరిష్ఠంగా రూ.46 ధర పలికాయని రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 975 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయని తెలిపారు. కిలో సరాసరి ధర రూ.36, కనిష్ఠ ధర రూ.26 పలికాయని తెలిపారు.



జ్యోతిప్రజ్వలన చేసి వైభవ్ జ్యుయలర్స్‌ను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

అనంతపురం ఫైనాన్షియల్ హబ్‌గా ఎదగాలి

వైభవ్ జ్యువెలర్స్ ప్రారంభోత్సవంలో వక్తలు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ఫైనాన్షియల్ హబ్‌గా అభివృద్ధి చెందాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని రాజు రోడ్డులో వైభవ్ జ్యువెలర్స్ 16వ షోరూమ్‌ను బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఏపీ ఎస్పీఎఫ్ డీజీ అంజనాసిన్హా, బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వంశీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై.. షో రూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎగ్జిబిషన్స్ ద్వారా సుపరిచితమైన విశాఖపట్నం వైభవ్ జ్యువెలర్స్. తమ విస్తృతమైన శ్రేణి, అద్భుతమై పనితనంతో అనంతపురం జిల్లా వినియోగదారులకు ఆభరణాలను అందుబాటులోకి తీసుకురావడం శుభపరిణామమని అన్నారు. రోజురోజుకీ జిల్లాలో పెద్ద పెద్ద కంపెనీల షాపింగ్‌మాల్స్ పెరుగుతున్నాయని, ఇదే పంథాల్లో జిల్లా ఫైనాన్షియల్ హబ్‌గా ఎదగాలని, అనేకమందికి ఉపాధి అవకాశాలు లభించాలని ఆకాంక్షించారు. అనంతరం షాపింగ్‌మాల్ నిర్వాహకులు ముఖ్య అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో ఐటీసీ డీలర్ సుబ్బరాయుడు శెట్టి, అనంతపురం వైభవ్ సంస్థల సీఎండీ మల్లికా రత్నకుమారి, హోల్‌టైమ్ డీలర్ గ్రంధి కీర్తన, సీటీఓ గోంట్ల రాఖాల్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ రఘునాథ్, ఈడీ సింధూరి వెంకటేష్, ఏలూరు ఎండీ అమరేంద్ర, ఉదయ్‌కుమార్, కంకటాల మల్లిక్, పైడా కృష్ణప్రసాద్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఓ భర్త కన్నీటి కథ..!

భార్య బతకదని తెలుసు..
క్యాన్సర్ కబళిస్తోందని తెలుసు..
అయినా..
బతికించుకోవాలని..
ప్రాణాలు కాపాడుకోవాలని..
ఆ భర్త ఆరాటపడ్డాడు..
కూలి చేసుకునే ఆ నిరుపేద..
సర్వశక్తులూ ఒడ్డాడు..
దొరికిన చోటల్లా అప్పులు చేసి..
భార్యకు వైద్యం చేయించాడు..
చేతిలోని డబ్బు.. అప్పుగా తెచ్చుకున్నదీ..
అంతా అయిపోయింది..
భార్యను ఆస్పత్రి నుంచి అత్తారింటికి తెచ్చాడు..
అక్కడే ఉంచి.. అప్పు కోసం తిరిగాడు..
ఎలాగైనా బతికించుకోవాలని
తపనపడ్డాడు..
ఇంతలోనే భార్య ఆరోగ్యం క్షీణించింది..
అత్తింటివారు విషయం చెప్పారు..
అంపశయ్యపై ఉన్న ఆలిని..
తెచ్చుకుందామని బయల్దేరాడు..
ఆ అభాగ్యుడి కన్నీటి కథ..
మరో మలుపు తిరిగింది..
గోడకూలి అతడి కాలు విరిగింది..
ఇంతలోనే భార్య కన్నుమూసింది..
ఇంట్లో భార్య మృతదేహం..
అక్కడే అమాయకంగా పిల్లలు..
ఆలి అంతిమ సంస్కారాలకు కూడా..
చేతిలో చిల్లిగవ్వలేని..
ఓ మూలన మంచంపై కదలలేని స్థితిలో
ఆ అభాగ్యుడు..
కన్నీటి పర్యంతమవుతున్నాడు..

కాలు విరిగి మంచాన పడిన నరసింహులు



భార్యకు ప్రాణాంతక జబ్బు

- అప్పులు చేసి వైద్యం..
- సర్వశక్తులూ ఒడ్డిన వైనం..
- అయినా.. మింగేసిన క్యాన్సర్
- చివరి గడియల్లో భర్తకు ప్రమాదం
- కాలు విరిగి మంచాన పడిన అభాగ్యుడు



తల్లి మృతదేహం వద్ద చిన్నారులు

హిందూపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఓ భర్త కన్నీటి కథ ఇది. రొద్దం మండలం రెడ్డిపల్లి వాసి నరసింహులుకు కొన్నేళ్ల క్రితం కర్ణాటకలోని పావగడ తాలుకా నేలిగానిపల్లికి చెందిన దుగ్గమ్మతో వివాహమైంది. వీరికి రెండేళ్ల కుమారుడు నందీష్, ఐదేళ్ల కుమార్తె అనన్య ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఉన్నఫలంగా దుగ్గమ్మ అనారోగ్యం బారినపడింది. వైద్య పరీక్షలు చేయించగా.. ఆమె క్యాన్సర్ బారిన పడినట్లు తేలింది. దీంతో నరసింహులు దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. భార్యను ఎలాగైనా బతికించుకోవాలనుకున్నాడు. బంధువులు, తెలిసిన వారి వద్ద అప్పులు చేసి, ఆస్పత్రుల్లో చూపించాడు. బెంగళూరు ఆస్పత్రుల్లో చేర్పించాడు. అయినా ప్రయోజనం లేదని వైద్యులు తెలిపారు. దీంతో నిస్సహాయ స్థితిలో భార్యను బెంగళూరు ఆస్పత్రి నుంచి పుట్టిల్లయిన పావగడ తాలుకా నేలిగానిపల్లికి తీసుకొచ్చాడు. అప్పు పుడితే ఇంకా ఎక్కడికైనా వైద్యానికి తీసుకెళ్దామని స్వగ్రామమైన రెడ్డిపల్లికి వచ్చాడు. భార్య ఆరోగ్యం మరింత క్షీణించింది. మంగళవారం సాయంత్రం బంధువులు ఫోన్ చేసి, దుగ్గమ్మ ఆరోగ్యం పూర్తిగా క్షీణించిందనీ, ఆమెను ఊరికి తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో నరసింహులు రెడ్డిపల్లి నుంచి పావగడకు వెళ్లాడు. అక్కడి నుంచి నేలిగానిపల్లికి వెళ్లేందుకు ఆటో కోసం గోడ కింద కూర్చుని ఉన్నాడు. విధి వక్రించి గోడ కూలి అతడిపై పడటంతో కాలు విరిగింది. ఇంతలోనే దుగ్గమ్మ మృతిచెందింది. విషయం తెలియడంతో నరసింహులు బోరున విలపించాడు. దుగ్గమ్మ మృతదేహాన్ని రెడ్డిపల్లికి తీసుకొచ్చారు. కాళ్లు విరిగి మూలనపడిన భర్త, క్యాన్సర్‌తో మృతిచెందిన భార్యను చూసి బంధువులు, గ్రామస్థులు కన్నీళ్లు పెట్టుకున్నారు. ఆమె దహనసంస్కారాలకు కూడా నరసింహులు చేతిలో చిల్లిగవ్వ లేదు. వారి పరిస్థితిని చూసిన బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

అనంతేశ్వరస్వామి కల్యాణోత్సవం


స్వామి అమ్మవారు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : లోకకల్యాణం కోసం శారదానగర్‌లోని శివ బాలయోగి ఆశ్రమంలో బుధవారం అనంతేశ్వర స్వామి కల్యాణోత్స వాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్ల ఉత్సవ మూర్తులతో ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అనంతేశ్వర స్వామి, అనంతేశ్వరి మాతకు ప్రత్యేక అలంకరణలు చేసి కల్యాణోత్సవం నిర్వహించారు. మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పెద్దఎత్తున అన్న సంతర్పణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షుడు రత్నగిరి దేవరాజ్, కార్యదర్శి మల్లికార్జున, సురేష్, ప్రసాద్, విశ్వనాథ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'డీలర్ల సమస్యలను పరిష్కరించండి'


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న డీలర్ల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ ఎరువుల డీలర్ల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎరువులు, పురుగు మందులు, క్రిమిసంహారక మందుల ఎరువుల డీలర్ల సంఘం నాయకులు రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడును కోరారు. వారు బుధవారం విజయవాడలో మంత్రి అచ్చెన్నాయుడును వ్యవసాయ శాఖ ఎరువుల డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటనాగిరెడ్డి, ఇతర రాష్ట్ర నాయకులతో కలిసి ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్‌రెడ్డి, పలువురు జిల్లా ప్రతినిధులు కలిశారు. గత ప్రభుత్వం కంపెనీలకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని కోరారు.

పొలం పిలుస్తోంది..

అనంతపురం రూరల్, అక్టోబరు(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి, కాటిగానికాలువ గ్రామాల్లో వ్యవసాయాధికారులు బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ శశికళ హాజరయ్యారు. మట్టి నమూనా పరీక్షల ఫలితాలను వాటికి సంబంధిం చిన కార్డులను రైతులకు అందజేశారు. కౌలు రైతు కార్డులు అందించారు. ఈకార్యక్రమంలో ఏఈఓ అలేఖ్య, పట్టు పరిశ్రమశాఖ సహాయకులు కిశోర్‌కుమార్, రైతు సేవా కేంద్ర సహాయకులు దేవేంద్రరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడాపురానికి చెందిన టీడీపీ నాయకుడు ఆదినారాయణను బుధవారం ఎమ్మెల్యే పరిటాలసునీత పరామర్శించారు.ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్యపరిస్థితులను అడిగితెలుసుకున్నారు. ఎమ్మెల్యేవెంట టీడీపీ సీనియర్ నాయకులు ఎల్ నారాయణచౌదరి, టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య ఉన్నారు.


గ్యార్మీ వేడుకలో ఎస్పీ

ఘనంగా గ్యార్మీ

అనంతపురం క్రైం/అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్‌హెడ్ క్వార్టర్స్‌లోని మహబూబ్ సుబహాని దర్గాలో బుధవారం గ్యార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ జగదీష్ దర్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అలాగే ఈ వేడుకలకు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ హాజరయ్యారు. ముందుగా దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా ప్రాముఖ్యత, అక్కడ నిర్వహించే కార్యక్రమాలపై ఆరా తీశారు. కార్యక్రమాల నిర్వహణ కోసం తన వంతుగా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

వాల్మీకి జయంతిని విజయవంతం చేయండి

గార్లదిన్నె, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గురువారం నిర్వహించే వాల్మీకి జయంతిని వియజవంతం చేయాలని వాల్మీకి సంఘం నాయకులు సూరి కోరారు. అన్ని గ్రామాల నుంచి వాల్మీకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

డాబాల్లో పోలీసుల తనిఖీలు

గార్లదిన్నె, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): డాబా, హోటల్లో మద్యం తాగనిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. మండలపరిధిలోని కల్లూరు, గార్లదిన్నె డాబాల్లో పోలీసులు బుధవారం రాత్రి తనిఖీలు చేశారు. డాబా, హోటళ్లలో మద్యం తాగనిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డాబా, హోటళ నిర్వాహకులకు జమేదర్ ఫిరోజ్ హెచ్చరించారు.

టీడీపీ నాయకుడి మృతి

కనగానపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెమలివరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ(56) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఆయన నెల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పలు ఆస్పత్రులలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్టు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య అనసూయమ్మ, ఇద్దరు పిల్లలున్నారు. ఆయన మృతికి టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు.

బస్సు బోల్తా... పదిమందికి గాయాలు


బోల్తా పడిన బస్సు

రాప్తాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపాపురం సమీపంలో పెట్రోలు బంకు వద్ద బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు 44వ జాతీయ రహదారిపై ప్రైవేటు బస్సు బోల్తా పడి, పది మందికి గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న ప్రైవేటు స్లీపర్ బస్సులో దాదాపు 60 మంది ప్రయాణికులున్నారు. బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు హంపాపురం సమీపంలో పెట్రోలు బంకు వద్ద బస్సు అదుపు తప్పింది. బస్సు ఎడమవైపు డివైడర్లను ఢీ కొని బోల్తా పడింది. పది మంది గాయపడ్డారు. వారిని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని రాప్తాడు సీఐ శ్రీహర్ష పరిశీలించారు. బస్సులో ప్రయాణిస్తూ గాయపడిన ఓ ప్రయాణికుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


రామ్‌నగర్‌లోని పాత ఆర్టీఓ ఆఫీస్ రోడ్డు ఇలా...


పాతూరులోని తిలక్ రోడ్డుపై గుంత

నగరంలో మారని రోడ్ల తీరు

● గుంతలతో నగరవాసుల అవస్థలు

అనంతపురం క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన నగరంలో రహదారుల విషయంలో ఇంకా మార్పు రాలేదు. చాలా చోట్ల ఇంకా గుంతల రోడ్లు దర్శనమిస్తున్నాయి. గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో గుంతలు లేని రోడ్లు చేస్తామని గొప్పలు చెప్పినా అమలుకు నోచుకోలేదు. దాదాపు ఏడాది కాలంగా బిల్లులు కాకపోవడంతో, కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. పలు కారణాలతో కొన్ని టెండర్లకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో నగరంలో ఇంకా గుంతలు పడిన రోడ్లు వెక్కిరిస్తున్నాయి. వరుస వర్షాలతో గుంతలు పడిన రోడ్లలో ప్రయాణించడానికి నగరవాసులు భయపడాల్సి వస్తోంది. నగరంలోని రామ్‌నగర్‌లో పాత ఆర్టీఓ ఆఫీస్‌రోడ్డులోనే రిజిస్ట్రేషన్ కార్యాలయం, అపార్ట్‌మెంట్లతో పాటు దాదాపు 250కిపైగా కుటుంబాలున్నాయి. స్థానిక రోడ్డు గుంతలమయం కావడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని స్థానికులు, తదితరులు వాపోతున్నారు. ఆ రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు. అలాగు నగరంలోని చాలా ప్రధాన రహదారుల్లో సైతం గుంతలుండటంతో వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు.

పల్లెల రూపురేఖలు మార్చడమే ప్రభుత్వ లక్ష్యం


సీసీరోడ్డు శిలాఫలకం అవిష్కరించిన ఎంపీ, ఎమ్మెల్యే

● ఎంపీ అంబికా, ఎమ్మెల్యే శ్రావణి శ్రీ

గార్లదిన్నె, అక్టోబర్ 16(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మ గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని నేడు కూటమి ప్రభుత్వం నెరవేర్చ బోతోందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. పల్లెపండుగ వారోత్సవాల కార్యక్రమాన్ని బుధవారం మండల పరిధిలోని ముంటిమడుగు, కొత్తూరు గ్రామాల్లో చేపట్టారు. ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ముఖ్య అతిథులుగా హాజరయ్యా రు. ఈ సందర్భంగా కొత్తూరు సమీపంలో ఉపాధి పథకం ద్వారా రూ. 49.50 లక్షల నిధులతో సుమారు కిలో మీటరు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.... దేశానికి పల్లెలే పట్టుకొమ్మలని గాంధీజీ చెప్పిన విధంగా గ్రామాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పల్లెపండుగ వారోత్సవాల భాగంగా సీసీరోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కక్కటిగా నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ విశాలాక్షి, సర్పంచు రాధికమ్మ, తహసీల్దార్ బండారు ఈరమ్మ, ఎంపీడీఓ యోగానందరెడ్డి, పీఆర్ఏఈ శ్రీనివాస్‌రావు, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ లక్ష్మణ్, గేటుక్రిష్ణారెడ్డి, పాండు, గుత్తాబాలకృష్ణ, సుంకన్న, ఎంపీటీసీ సురేంద్రనాథ్‌రెడ్డి, జయరాం, బాబయ్య, చల్లానాగరాజు, వడ్లరాము, శ్రీనాథ్, శ్రీరాములు, గుత్తాహరి, చింతావెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అభివృద్ధి దిశగా పల్లెలు


సమస్యలు వింటున్న ఎమ్మెల్యే

● ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో పల్లెల్లో అభివృద్ధి జాడ మొదలైందని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని మేడాపురం గ్రామంలో బుధవారం పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా రూ.60లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. జడి వాన కురుస్తున్న స్థానిక మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లా డుతూ... ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. నియోజకవర్గానికి ప్రభుత్వం రూ.25 కోట్లు నిధులు మంజూరు చేసిందని, ఇప్పటికే అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రజల సమస్యలను అడిగితెలుసుకు న్నారు. ఎంపీడీఓ శివశంకరప్ప, తహసీల్దార్ సురేశ్‌కుమార్, పంచాయతీ రాజ్ డీఈఈ లక్ష్మీనారాయణ, జేఈఅబ్దుల్‌ఖాదర్, ఈఓఆర్డీ అశోక్‌నాయక్, టీడీపీ నాయకులు ఎల్ నారాయణచౌదరి, కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, వసల పెద్ద వెంకటరాముడు, లద్దు లక్ష్మయ్య, సందులో వెంకటేశ్, పక్కీరప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్, టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు జగదీశ్, పాల్గొన్నారు.

నేడు గొందిరెడ్డిపల్లిలో ఎమ్మెల్యే పర్యటన

రాప్తాడు: మండలంలోని గొందిరెడ్డిపల్లి, పుల్లలరేవు గ్రామాల్లో గురువారం నిర్వహించే పల్లె పండుగ కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరవుతారని టీడీపీ మండల కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు బుధవారం ఓ ప్రటకనలో తెలిపారు. ఉదయం 8:30 గంటలకు గొందిరెడ్డిపల్లికి వస్తాని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.

బ్రిడ్జి కోసం ధర్నా


వర్షంలోనే ధర్నా చేస్తున్న రహదారి పోరాట సమితి సభ్యులు

శింగనమల, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి పనుల్లో భాగంగా శింగనమల మరవకొమ్మ వద్ద బ్రిడ్జి నిర్మించాలని శింగనమల రహదారి పోరాట సమితి సభ్యులు, ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం జాతీయ రహదారికి అడ్డంగా కూర్చొని పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. మరవకొమ్మ వద్ద బ్రిడ్జి నిర్మించాలని పలు మార్లు అధికారులకు ప్రయోజనం లేకపోయిందన్నారు. గంటపాటు ధర్నా చేపట్టారు. సీఐ కౌలుట్లయ్య అక్కడికి వచ్చి బ్రిడ్జి నిర్మాణం కోసం అధికారులతో మాట్లాడుతానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం వారు తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు రాంచరణ్ యాదవ్ తదితరులు ప్రాల్గొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజ


భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు

అనంతపురం రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కక్కల పల్లి రూరల్ పంచాయతీ ప్రజా శక్తినగర్, పురుషోత్తం కాలనీలో రూ.17 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణానికి ఈఓఆర్డీ వెంకటనాయు డు, ఇతర మండల అధికారులు భూమి పూజ చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరికృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, వీఆర్వో స్వామి, పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లా, నాయకులు నారాయణస్వామి, బండినరసింహులు, వలిప్రకాష్, వెంకటేశులు, మసూద్, శ్రీనివాసులు, లక్ష్మయ్య అన్వర్, నగేష్, ఆదినారాయణ, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: మండల పరిధిలోని పెద్ద మట్లగొంది, ఆకులేడు, లోలూరు, నలకంచెరువు గ్రామాల్లో బుధవారం పల్లె పండుగ కార్యాక్రమం నిర్వహించారు. మట్లగొంది సర్పంచ్ రమేష్ , ఎంపీడీఓ నిర్మాకుమారి ఈఓపీఆర్‌డి వెంకటలక్ష్మి ఏపీఓ శ్రీదేవి సీసీ దామోదర్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం.. అధికారులు అప్రమత్తం


ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

కనగానపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):మండలంలో మంగళవారం అర్ధరాత్రినుంచి ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. మండల వ్యాప్తంగా 4 మి.మి వర్షపాతం నమోదైంది. దీంతో తహసీల్దార్ రమాదేవితోపాటు అధికారులు అప్రమత్తమయ్యారు. తూంచెర్ల గ్రామంలో కొండచుట్టూ నివాసముంటున్న వారిని పునరావాస కేంద్రానికి తరలించి భోజనాలు, వసతులు ఏర్పాటుచేశారు. అదే విధంగా బద్దలాపురం గ్రామంలోపాటు పడిన ఇళ్లను గుర్తించి ఇంటిలోని వారిని పునరావాసానికి తరలించారు.

శస్త్రచికిత్సల్లో అనస్తీషియా వైద్యులే కీలకం

సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

అనంతపురం టౌన్, అక్టోబరు 16(ఆంధ్ర జ్యోతి): వైద్యరంగంలో రోగులకు శస్త్రచికిత్సలు నిర్వహించడంలో అనస్తీషియా వైద్యుల పాత్రే చాలా కీలకమని జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అనస్తీషియా దినోత్సవం సందర్భంగా బుధవారం బోధనాసుపత్రిలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. అనస్తీషియా విభాగం ఆధ్వర్యంలో తొలుత డాక్టర్లు, టెక్నీషియన్లు, మెడికోలు ర్యాలీ చేపట్టారు. అనంతరం మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా సూపరింటెండెంట్ హాజరై మాట్లాడారు. ఈకార్యక్రమంలో అనస్తీషియా హెచ్ఓడీ డాక్టర్ నవీన్‌కుమార్, సూపర్‌స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ అనస్తీషియా డాక్టర్ సుబ్రమణ్యంతో పాటు పలువురు డాక్టర్లు పాల్గొన్నారు. అనస్తీషియా దినోత్సవం సందర్భంగా పోలీసులకు సీపీఆర్‌పై డాక్టర్లు అవగాహన కల్పించారు.

ఆర్ఈఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉమాదేవి

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆర్ఈఎఫ్ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉమాదేవి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రామచంద్ర, వర్కింగ్ ప్రెసెడెంట్ డాక్టర్ ఎండీ నాగభూషణ ఉత్తర్వులను ఉమాదేవికి అందజేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పనిచేసే అధికారులకు నూతన బాధ్యతలు అప్పగిస్తున్నామని వారు పేర్కొన్నారు.

సర్వజన ఆస్పత్రిలో వసతుల పరిశీలన

అనంతపురం టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలోని వసతులను ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైద్యుల బృందం పరిశీలించింది. ఆ యూనివర్సిటీకి చెందిన డాక్టర్లు విద్యాసాగర్, స్నిగ్ధా, విజయభాస్కర్, సుధీర్ బుధవారం ఆస్పత్రికి చేరుకున్నారు. చిన్న పిల్లల విభాగం, గైనకాలజీ, అనస్తీషియా విభాగాల్లో తిరుగుతూ అక్కడకు వస్తున్న రోగులు, కల్పిస్తున్న వసతులు, డాక్టర్లు, సిబ్బంది, వారు అందిస్తున్న వైద్యసేవలు పరిశీలించారు. ఆస్పత్రిలో అడ్మిషన్ విధానంపైనా పరిశీలించారు. మరిన్ని పీజీ సీట్ల మంజూరుకోసం వారు నివేదికలను ఎన్ఎంసీకి పంపుతారని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

లారీ, కారు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు


కారులో ఇరుక్కు పోయిన వారిని బయటకు తీస్తున్న స్థానికులు

యాడికి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి సరదాగా విహారానికి వెళ్లిన వారు మండలంలోని ఆదర్శపాఠశాల సమీపాన జాతీయ రహదారిపై ప్ర మాదం బారిన పడి తీవ్రగాయాలపాలయ్యారు. అనంతపురం నగరానికి చెందిన ముగ్గురు యువకులు, తాడిపత్రికి చెందిన శ్రీధర్ బుధవారం యాడికి మండలంలోని కోన జలపాతం చూడడానికి వెళ్లి, అక్కడ సరదాగా గడిపారు. యాడికిలో ఉన్న వారి స్నేహితుడిని కలిసి మాట్లాడారు. అనంతరం నలుగురు తమ కారులో యాడికి నుంచి వేముల పాడు మీదుగా అనంతపురం బయలుదేరారు. ఆదర్శ పాఠశాల సమీపాన ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. కారు డ్రైవ్ చేస్తున్న శ్రీధర్, ముందు భాగంలో కూర్చొన్న అనంతపురానికి చెందిన మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. వారు కారులోనే ఇరుక్కుపోయారు. స్థానికులు అతికష్టం మీద వారిని బయటకు తీశారు. కారు వెనుక భాగంలో కూర్చొన్న మరో ఇద్దరు యువకు లు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని అనంతపురం తరలించారు.

పూడికతీత పనులు వేగవంతంగా చేయండి

● కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్


పూడికతీత పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

అనంతపురం క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రధానమైన మరువవంక, నడిమివంకల్లో పూడికతీత పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం నగరంలోని మొదటిరోడ్డు పొట్టి శ్రీరాములు నగరపాలకోన్నత పాఠశాలలో పునరావాస కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం నగరంలోని ఆరో రోడ్డు పరిధిలోని నడిమివంక, సోమనాథ్‌నగర్, తపోవనం, యువజనకాలనీ, కొవ్వూరునగర్ ప్రాంతాల్లో పూడికతీత పనులు పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఆయా కేంద్రాల్లో ఏర్పాట్లను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ప్లాస్టిక్‌ను నిషేధించడం, వేస్ట్ సెగ్రిగేషన్, వేస్ట్ డిస్పోజల్ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ స్థానికులతో మాట్లాడారు. వారి సమస్యలను పరిష్కరించాలని ఆర్డీఓను ఆదేశించారు. నగర కమిషనర్ నాగరాజు, ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ హరికుమార్, ఎస్ఈ భాస్కర్‌రావు, ఈఈలు, ఎంహెచ్ఓ పాల్గొన్నారు.

సొసైటీలలో కంప్యూటరీకరణ పూర్తిచేయాలి

అనంతపురం టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అగ్రికల్చరల్ కోఆపరేటివ్ సొసైటీలలో కంప్యూటరీకరణ ప్రక్రియను నవంబరు 1వతేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. ఆయన బుధవారం ఆర్డీఓలు, డీఎల్‌డీఓలు, డీసీఓ, డీఎల్‌పీఓ, ఆడిటర్లతో సమా వేశం నిర్వహించారు. ఇతర బ్యాంకులకు దీటుగా సొసైటీల్లోనూ లావాదేవీలు కొనసాగాలన్నారు. కంప్యూటరీకరణలో జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచాలని సూచించారు. ఈ విషయంలో ఎవరూ నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు.

హైవేలో బస్టాప్ నిర్మిస్తాం : ఎంపీ

గార్లదిన్నె, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రలో హైవేలో బస్టాప్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. ముంటిమడుగు, కొత్తూరులో బుధవారం సాయంత్రం పల్లెపండుగ వారోత్సవాలకు ఎంపీతో పాటు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరయ్యారు. గార్లదిన్నె హైవేలో బస్టాప్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక నాయకులు ఎంపీకి తెలిపారు. స్పందించిన ఎంపీ వెంటనే ఆర్టీసీ ఆర్ఎంకు ఫోన్‌చేసి, గార్లదిన్నె హైవేలో బస్టాప్ నిర్మాణానికి తగిన చర్యలు త్వరగా చేపట్టాలని సూచించారు. త్వరలోనే స్థలం పరిశీలించి బస్టాప్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆర్ఎం సమాధానం ఇచ్చారు.

ఆహారాన్ని వృథా చేయకండి

అనంతపురం కల్చరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆహారాన్ని ఎవరూ వృథా కానివ్వకూడదని సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ సర్వజనాస్పత్రితో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో అన్నదానం నిర్వహించారు. పేదల ఆకలి తీర్చేందుకు 2003లో తాము మొదలుపెట్టిన అన్నదాన ఉద్యమంలో భాగంగా నేటికీ ఎంతోమందికి కడుపు నింపగలగుతుండడం స్ఫూర్తిని కలిగిస్తోందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రాఘవేంద్ర, నారాయణ, వైద్య విద్యార్థి విఘ్నేష్ తదితరులలు పాల్గొన్నారు.


విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న యువతులు

రాప్తాడు మండలం బండమీదపల్లిలో దసరా మరుసటి రోజు గ్రామంలోని ఆలయంలో గౌరమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రతి రోజూ పూజలు చేశారు. బుధవారం సాయంత్రం యువతులు, మహిళ లు విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.
- రాప్తాడు (ఆంధ్రజ్యోతి)

బాస్కెట్‌బాల్ జిల్లా జట్టుకు అభినందనలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం దక్కించుకున్న జిల్లా జట్టును ఇన్‌చార్జి డీఎస్‌డీఓ అనీల్‌కుమార్ తదితరులు బుధవారం అభినందించారు. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో నిర్వహించిన 9వ ఏపీ రాష్ట్ర సబ్‌జూనియర్ బాల, బాలికల చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా బాలుర జట్టు అత్యంత ప్రతిభ కనబరిచి రన్నర్‌గా నిలిచింది. బుధవా రం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో జిల్లా జట్టును ఇన్‌చార్జి డీఎస్‌డీఓ అనీల్‌కుమార్, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హబీబుల్లా, నరేంద్రచౌదరి, విశ్రాంత డీఎస్‌డీఓ రమణ, శాప్ కోచ్ వంశీలు అభినందించారు.

పల్లె పండుగతో అభివృద్ధికి శ్రీకారం : డీపీఓ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ, పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఎన్ఆర్‌జీఎస్ నిధులతో జిల్లాలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు డీపీఓ నాగరాజనాయుడు పేర్కొన్నారు. ఆయన బుధవారం కార్యాలయంలోని తమ చాంబర్‌లో పలు విషయాలను వెల్లడించారు. ఉపాధి నిధుల ద్వారా పంచాయతీల్లో కాలువలు, రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అంతే కాకుండా 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా రూ.23.4 కోట్లతో జిల్లాలో 1009 పనులను ఇప్పటికే గుర్తించామన్నారు. వీటన్నిం టికి నవంబర్ 1న భూమి పూజ చేస్తామన్నారు. అలాగే క్లాప్‌మిత్రాలకు వేతన బకాయిలతో పాటు ఎటువంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. అవసరం ఉన్న చోట సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లు నిర్మిస్తామ న్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న 39 నిర్మాణాలను పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని ఆయన వివరించారు.

రైఫిల్ షూటింగ్‌లో అనంతలక్ష్మి విద్యార్థుల ప్రతిభ


ప్రతిభా విద్యార్థులతో అనంతరాముడు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : రైఫిల్ షూటింగ్‌లో అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బుధశారం కళాశాల చైర్మన్ అనంతరాముబు విద్యార్థులు సాయి చరణ్‌రెడ్డి, రిత్విక్‌ను అభినందించారు. ఈనెల 19నుంచి 21వరకు రాజమండ్రిలో నిర్వహించే రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు, సీఈఓ నరసింహరావు, కోచ్ నవీన్ పాల్గొన్నారు.

పూజారి కుటుంబానికి ఆర్థిక సాయం

రాప్తాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లి గ్రామ దేవత సల్లాపురమ్మ పూజారి మాధవరాజు (40) బుధవారం తెల్లవారుజామున అకస్మికంగా మృతి చెందాడు. టీడీపీ నాయకులు మాధవరాజు మృతదేహానికి పూల మాల వేసి నివాళి ర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి ఆదేశాల మేరకు పూజారి కుటుంబ సభ్యులకు రూ. 10 వేలు ఆర్థిక సాయం అందచేశారు.మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు, వెంకట్రాముడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు నారాయణస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

పప్పుశనగ కోసం నిరీక్షణ..!

- నేటికీ మండలానికి చేరని వైనం
- అదును దాటుతోందని రైతుల ఆందోళన
- విధిలేక బయట కొనుగోలు

యాడికి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సరఫ రాచేసే సబ్సిడీ విత్తన పప్పుశనగ కోసం మండల వ్యాప్తంగా రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. సాగుకు అ దును దాటిపోతున్నా విత్తనం పంపిణీ చేయకపోవ డం పై రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలం లోని ఎన్. కొత్తపల్లి, వేములపాడు, నగరూరు, భోగాల కట్ట, వెంగన్నపల్లి, తిప్పారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో పప్పుశనగ సాగు ఎక్కువగా చేస్తారు. గత ఏడాది మండలం లో 2,480 హెక్టార్లలో పప్పుశనగ సాగుచే శారు. ఈ ఏడా ది ప్రభుత్వం సరఫరా చేసే సబ్సిడీ విత్తన పప్పుశనగ కోసం 516 మంది రైతులు రిజిస్ట్రేష న్ చేసుకున్నారు. 400 క్వింటాళ్ల విత్తన పప్పుశనగ మండలానికి రావాల్సి ఉంది. విత్తనం పంపిణీ చేసి ఉంటే ఈపాటికి విత్తు పూ ర్తి చేసేవాళ్లమని రైతులు అంటున్నారు. ప్రభుత్వం ఇస్తున్నదే అరకొర విత్తనం.. అందులో పంపిణీ కూడా ఆ లస్యం చేస్తే ఎలా అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పప్పుశ నగ సాగుకు ఎకరాకు 45 కిలోల వి త్తనం అవసరమ వుతుందని, ప్రభుత్వం ఎకరాకు 20 కిలోలు, గరిష్ఠంగా 5ఎకరాల వరకు మాత్రమే పంపిణీ చేస్తోందని తెలి


రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు(ఫైల్), ఎన్. కొత్తపల్లి వద్ద సిద్ధం చేసిన పొలం

పారు. ప్రభుత్వం సరఫరా చేసే పప్పుశనగ విత్తనం సబ్సిడీపోను క్వింటా రూ.7050 ధర ఉం దని, బహిరం గమార్కెట్‌లో క్వింటా పప్పుశనగ రూ.7200 ఉందని రైతులు పెదవి విరుస్తున్నారు. ప్రభు త్వం సబ్సిడీ విత్తనం ఎప్పుడు పంపిణీ చేస్తుందో తెలియక రైతులు బయట కొనుగోలు చేసి సాగుచేస్తున్నా రు. అధికా రులు పప్పుశనగ విత్తన పంపిణీ చేస్తే పంట సాగు చేసుకుంటామని రైతులు చెబుతున్నారు. వ్యవసా య శాఖ అధికారులు చర్యలు చేపట్టి పప్పుశనగ విత్తనం వెంటనే పంపిణీ చేయాలని కోరుతున్నారు.

అదును దాటిపోయాక ఏమి ఉపయోగం

రంగయ్య, ఎన్. కొత్తపల్లి

నాలుగు ఎకరాల్లో పప్పుశనగ సాగు కోసం సేద్యం పనులు పూర్తిచేశాను. ప్రభుత్వం సరఫరా చేసే సబ్సిడీ పప్పుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నాను. రిజిస్ట్రేషన్ చేసి 15రోజులు పైగా అయింది. ఇంతవరకు విత్తనం మండలానికి రాలేదు అంటున్నారు. ఇంకెప్పుడు పంపిణీ చేస్తారు. విత్తనం ఎప్పుడు వేసుకోవాలి, అదును దాటిన తర్వాత విత్తనం పంపిణీ చేస్తే ఏమి ఉపయోగం.

అధికారులు స్టాక్ రాలేదంటున్నారు

- మృత్యుంజయనాయుడు, ఎన్. కొత్తపల్లి

సబ్సిడీ పప్పుశనగ విత్తనం కోసం అధికారులను అడిగి తే ఇంకా స్టాక్ రాలేదు అంటున్నారు. రిజిస్ట్రేషన్ చేసు కొని 15 రోజులైంది. అయినా స్టాక్ రాలేదంటే ఎలా.. వి త్తనం ఎప్పుడు పంపిణీ చేస్తారు.. మేము ఎప్పుడు సా గుచేయాలి..? విత్తనం ఎప్పుడు వస్తుందో కూడా అధికా రుల వద్ద సమాచారం లేదు. పప్పుశనగ విత్తన పంపి ణీలో ఇంత నిర్లక్ష్యం తగదు. వెంటనే విత్తన పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి.

తుఫాన్ వల్ల ఆలస్యం

- మహబూబ్‌బాషా, ఏఓ

తుఫాన్ నేపథ్యంలో స్టాక్ పాయింట్ల వద్ద లోడింగ్ జర గలేదు. ఒకటి రెండురోజుల్లో పప్పుశనగ వస్తుంది. వచ్చిన వెంటనే రైతులకు పంపిణీ చేస్తాం. రైతులు ఆం దోళన చెందాల్సిన అవసరం లేదు. రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి రైతుకు పప్పుశనగ విత్తనాన్ని అందిస్తాం.

సీఎం అద్భుత సంకల్పం అన్న క్యాంటిన్


అన్న క్యాంటిన్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పేదల కడుపు నింపాలన్న స త్సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్న క్యాంటిన్ల ను పునఃప్రారంభించడం మానవత్వానికి నిదర్శనమని ఎమ్మెల్యే గుమ్మనూ రు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్‌ను ఆయన బుధవారం ఉదయం ప్రారం భించారు. తన పుట్టిన రోజు సందర్భంగా అన్న క్యాంటిన్‌ను ప్రారంభించి, ప్రజలకు టిఫిన్‌ను పంపిణీచేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావే శంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎంతో అద్భుత సంక ల్పంతో ప్రారంభించిన అన్న క్యాంటిన్లను వైసీపీ ప్రభుత్వం ఆపివేసి పేదల పొట్టలు కొట్టిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశి వుడు యాదవ్, నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు, బండారు ఆ నంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, పత్తి హిమ బిందు, ప్ర తాప్‌నాయుడు, తలారి మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.

పెద్దారెడ్డి భద్రతపై వివరాలు ఇవ్వండి

పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తాడిపత్రిలోని తన ఇంటి వద్ద భద్రతను ఏర్పాటు చేసేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ మాజీ ఎ మ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దాఖలు చేసిన పిటిషన్ బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. విచారణను ఈ నెల 19కి వాయి దా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. తాడిపత్రిలోని తన ఇంటి వద్ద భద్రత ఏ ర్పాటు చేసేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ పెద్దారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయ వాది శశిభూషణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి చెప్పినట్లు పోలీసులు నడుచుకుంటున్నారన్నారు. తరచూ హింసాత్మక ఘ టనలు జరుగుతున్నా.. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. న్యా యమూర్తి స్పందిస్తూ భద్రత కోరుతూ జిల్లా ఎస్పీకి వినతిపత్రం ఇచ్చారా? అని పిటిషనర్‌ను ప్రశ్నించారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

ఆర్ఎంపీలకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలి

- మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్


మాట్లాడుతున్నజేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీలు తప్పనిస రిగా లైసెన్సులు కలిగి ఉండాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ము న్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆర్ఎంపీలు, ల్యాబ్ టెక్నీషియన్లు, వాటర్‌ప్లాంట్ల నిర్వాహ కులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్లు వ్యర్థాలను చెత్తబండ్లకు ఇవ్వరాదన్నారు. బదులుగా వాటి కోసం ఒక ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఊరిని పరిశుభ్రంగా ఉంచుకొ నేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పేదలను పీడించి అధి క ఫీజులు, మందుల ధరలు వసూలు చేస్తున్నారని తన దృష్టికి వ చ్చిందన్నారు. నొప్పుల నివారణకు కొంతమంది స్టెరాయిడ్ ఇంజక్షన్లు ఇస్తున్నారని వీటివల్ల ప్రజలు మరిన్ని రోగాలకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. వాటర్‌ప్లాంట్లలో చాలావరకు ఐఎస్ఐ గుర్తింపు లే దన్నారు. మినరల్స్ లేని తాగునీటి వల్ల ప్రజలు అనారోగ్యం బారిన ప డే అవకాశాలు ఉన్నాయన్నారు. అధికరేట్లను కూడా నియంత్రించాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శివరామ కృష్ణ, నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, ప వన్‌కుమార్, మల్లికార్జున, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే


జేసీ ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

తాడిపత్రి, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మర్యాదపూర్వకంగా క లిశారు. దాదాపు రెండునెలల తర్వాత జేసీపీఆర్ తాడిపత్రికి రావడంతో బుధవారం ఎమ్మెల్యే కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు యల్లనూరు, పుట్లూరు మండలాల రాజకీయ ప రిస్థితుల గురించి చర్చించారు. ఆమె వెంట నాయకులు ముంటిమడు గు కేశవరెడ్డి, ఎస్వీ రవీంద్రారెడ్డి, హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి

ఉరవకొండ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురంలో రామాంజనేయులు (28) అనే రైతు బుధవారం సాయంత్రం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఆయన వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాడు. సా యంత్రం పొలం వద్ద మోటర్ స్టార్టర్‌ను ఆఫ్ చేసేందుకు వెళ్లగా వి ద్యుత్ షాక్‌కు గురయ్యాడు. స్థానికులు గుర్తించి ఉరవకొండ ప్రభుత్వా సుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

తాడిపత్రి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామచంద్ర లాడ్జి సమీపంలో బుధవారం ద్విచక్ర వాహనం డివైడర్ ఢీకొన్న సంఘటనలో అనిల్‌కుమార్ (29) అనే యువకుడు మృతి చెందినట్లు పట్టణ పోలీ సులు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన అనిల్‌కుమార్ పట్టణంలోని నం దలపాడులో నివాసం ఉంటున్నాడు. ద్విచక్రవాహనంపై ఐస్‌క్రీం వ్యా పారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే వ్యాపారానికి బయలుదేరిన అనిల్‌కుమార్ బైక్ అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. అనంతపురంలో చి కిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

పట్టణంలోని సుంకులమ్మపాలెంకు చెందిన సుజాత (43) అనే మహిళ అనంతపురంలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఈనెల 12న చంద్రశేఖర్, సుజాత దంప తులు ద్విచక్రవాహనంపై నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం ఇటి క్యాల గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా వెంకటరెడ్డిపల్లి గ్రామ సమీ పంలోకి రాగానే బైక్ అదుపుతప్పి కిందపడడంతో సుజాతకు గాయాల య్యాయి. అనంతపురంలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అనుమానాస్పదంగా వివాహిత ..

పుట్లూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ. కొండాపురం గ్రామంలో సంగీత (21) అనే మహిళ అనుమానాస్పదంగా మృతిచెం దినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌కు చెందిన సంగీత, నాగరాజును ఐదేళ్ల క్రితం ప్రేమించి వివాహం చేసు కున్నారు. అక్కడి నుంచి కొండాపురంలోని పవిత్ర హోటల్‌లో పనిచేసు కుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం జ్వరంతో బాధపడు తుంటే తాడిపత్రిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ మృతి చెందినట్లు తెలిపారు. బుధవారం బంధువులు వచ్చి సంగీత మృతిపై అనుమానాలు ఉన్నట్లు తెలిపారు. తమ్ముడు సునీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. మృతురాలికి కుమార్తె ఉంది.

ముమ్మరంగా వరదనీటి మళ్లింపు పనులు

బొమ్మనహాళ్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్, బండూరు వరదనీటితో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బుధవారం తహసీల్దార్ మునివేలు, ఈఓపీఆర్డీ దాస్, పంచాయతీ కార్యదర్శి శివన్న, వీఆర్వో యుగంధర్, టీడీపీ నాయకులు అప్పారావు, నవీన్, సంగప్ప, మాజీ సర్పంచ్ కోటేశ్వర్‌రెడ్డి, యుద్ధ ప్రాతిపదికగా ఎక్స్‌కవేట ర్‌తో పనులు చేయించారు. లోతట్టు ప్రాంతంలో నీరు నిలిచి పరిసర ప్రాంతాల కాలనీల్లోని ఇళ్లల్లోకి వెళుతుండటంతో అధికారులు చర్యలు చేపట్టారు. బండూరు గ్రామంలో ఆర్డీటీ కాలనీలోకి వెళ్లకుండా వేదావతి హగరి వైపున కాలువను తప్పించారు.

ఘనంగా ఎమ్మెల్యే జయరాం జన్మదిన వేడుకలు

గుంతకల్లు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాసనసభ్యుడు గుమ్మనూ రు జయరాం పుట్టినరోజు వేడుకలను కార్యకర్తలు, నాయకుల మధ్య బుధ వారం ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు ఎమ్మెల్యే అయిన తర్వాత వ చ్చిన తొలి పుట్టిన రోజును ఆయన సోదరులు, పార్టీ శ్రేణులు అత్యంత వైభ వోపేతంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన బర్త్‌డే కేక్‌ను జయరాం కట్‌చేయగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఒక వైపు ఏకధాటిగా వర్షం కురుస్తున్నా కార్యకర్తలు వానలో తడుస్తూనే వేలా దిగా తరలివచ్చి పూల హారాలు వేసి, కేక్‌లు కట్‌చేయించి జయరాంకు శుభా కాంక్షలు తెలిపారు. మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ యరాం మాట్లాడుతూ పార్టీలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే తనను అక్కున చేర్చుకుని, ఎమ్మెల్యేగా గెలిపించారని, ఆ ఆదరాభిమానాలను మరు వబోనని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులు, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, పత్తి హిమబిందు, ప్రతాప్‌నాయుడు, తలారి మస్తా నప్ప, టి. సరోజమ్మ, సర్పంచు వరలక్ష్మి, పెంచలపాడు వెంకటేశులు, బండారు శివ, కోడి శీన, పత్తిపాటి చంద్ర, డి. ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే జయరాంకు కేక్ తినిపిస్తున్న వెంకటశివుడు యాదవ్

లారీ, కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

యాడికి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్నేహి తులతో కలిసి సరదాగా విహారానికి వచ్చి ప్రమా దం బారిన పడి తీవ్రగాయాలపాలైన సంఘటన యాడికి మండలంలోని మోడల్‌స్కూల్ సమీపాన చోటుచేసుకుంది. అనంతపురానికి చెందిన ము గ్గురు యువకులు, తాడిపత్రికి చెందిన శ్రీధర్ బు ధవారం యాడికి మండలంలోని కోన జలపాతం చూడడానికి వచ్చారు. అక్కడ సరదాగా గడిపారు. యాడికిలో ఉన్న వారి స్నేహితుడిని కలిసి యోగ క్షేమాలు మాట్లాడుకున్నారు. శ్రీధర్‌తోపాటు ము గ్గురు యువకులు కారులో యాడికి నుంచి వేములపాడు మీదుగా అనంత పురం బయలుదేరారు. మోడల్‌స్కూల్ సమీపాన వారు ప్రయాణిస్తున్న కారు ముందు వైపు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. కారు డ్రైవ్ చేస్తున్న శ్రీధర్, ముందు భాగంలో కూర్చొన్న మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. వారు కారులోనే ఇరు క్కుపోయారు. స్థానికులు అతికష్టం మీద వారిని బయటకు తీశారు. కారు వెనుక భాగంలో కూర్చొన్న మరో ఇద్దరు యువకులు స్వల్పంగా గాయప డ్డారు. వారందరిని అనంతపురం తరలించారు.


కారులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీస్తున్న స్థానికులు, తీవ్రంగా గాయపడ్డ యువకులు

సీఎంకు రూ. 2.23 లక్షల చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న కేసీ హరి

గుంతకల్లు, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ శంకరా నందగిరి కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు వరదబాధితుల స హాయార్థం అందజేసిన విరాళాన్ని కరస్పాండెంట్ కేసీ హరి ముఖ్య మంత్రికి అందజేశారు. బుధవారం ఉదయం విజయవాడకు వెళ్లిన హరి నారా చంద్రబాబునాయుడు ను కలసి రూ. 2.23 లక్షల చెక్కు ను ఆయనకు అందజేశారు.

గజ వాహనంపై శ్రీవారు



గజవాహనంపై చింతలరాయుడు

తాడిపత్రి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధ వారం చింతల వెంకటరమణస్వామి ఆల యంలో శ్రీవారు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూ ర్తిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వ హించారు. అనంతర మంగళవాయిద్యాల నడుమ స్వామిని ఊరేగించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రి, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె గ్రామ సమీపం లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లు దేవేంద్ర, ప్రవీణ్‌కుమార్‌పై కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


ప్రశంసా పత్రం అందుకుంటున్న తేజశ్రీ

కూడేరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండ లంలోని మరుట్ల 2వ కాలనీకి చెందిన విద్యార్థిని తేజశ్రీ ఆడశిశువును కాపాడుదాం-సృష్టిని రక్షిద్దాం అన్న చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనపర్చింది. దీంతో బుధవారం అనం తపురంలో జాయింట్ కలెక్టర్ శివనారయణ్ శర్మ నుంచి ప్రశంసా పత్రం అందుకుంది. నార్పల మండలంలోని మహాత్మా జ్యోతిరావ్ పూలే గురుకుల పాఠశాల్లో పదోతరగతి చదువుతున్న తేజశ్రీ ఈ నెల 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో మూడోస్థానంలో నిలిచింది. విద్యార్థిని తల్లిదండ్రులు నాగలక్ష్మి, లక్ష్మీ నారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యక్తిపై దాడి.. ముగ్గురిపై కేసు

యాడికి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తన తమ్ముడిని చెడు అలవాట్లకు బా నిసను చేయవద్దని మందలించినందుకు కంబగిరిస్వామి అనే వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపా రు. పచ్చారుమేకలపల్లికి చెందిన నాగేంద్ర అనే వ్యక్తి చెడు వ్యసనాలకు బా నిస అయినట్లు తెలిపారు. అదే గ్రామానికి చెందిన కంబగిరిరాముడు, క ల్యాణ్, కిషోర్ అనే వ్యక్తులతో తిరగడం వలన తన తమ్ముడు చెడు వ్యసనా లకు గురైనట్లు తెలుసుకున్న నాగేంద్ర అన్న కంబగిరిస్వామి వారిని మంద లించాడు. మమ్మల్నే మందలిస్తావా అంటూ ముగ్గురు కంబగిరిస్వామిపై క ట్టెలతో దాడిచేయడంతో తలకు తీవ్రగాయమయింది. కంబగిరిరాముడు, కల్యాణ్, కిషోర్‌పై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు

తాడిపత్రి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసపురంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయ బలిజ కల్యాణమండపంలో బుధవారం కార్తీకమాసం పూ జలపై సమావేశం నిర్వహించినట్లు సంఘం నాయకులు మసూల్ ప్రసాద్, దద్దం సుబ్బరాయుడు తెలిపారు. నవంబరులో రానున్న కార్తీక మాసం సందర్భంగా కల్యాణమండపంలో నిర్మించిన శివకామేశ్వరి, సీతారాముల ఆలయంలో పూజలకు అందరి సహకారం కావాలన్నారు. సమావేశంలో నాయకులు మల్లికార్జున, రామనాథ్, వేణు, విజయభాస్కర్, బాబు, పెద్ద మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటలు వర్షార్పణం


వర్షానికి తడిసిన వేరుశనగ పంటను చూపుతున్న రైతు

కుందుర్పి/బొమ్మనహాళ్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్ట పడి చేతికందే సమయంలో తుఫాన్ ధాటికి వేరుశనగ పంట పూర్తిగా తడి సిపోయి రైతుకు కన్నీరు మిగిల్చింది. కంటికి రెప్పలా కాపాడుకున్న వేరుశ నగ పంట చేతికందే సమయంలో రైతులకు నిరాశనే మిగిల్చింది. పంట వేరు చేసి ఒక చోటుకు చేర్చుకునే లోపే గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లోనే తడిసిపోయి వేరుశనగ కాయలు, కట్టె బూజు పట్టాయి. కోత దశలో ఉన్న వేరుశనగ పంట ఈ వర్షానికి పంట పొలంలోనే మొలకలు ఎత్తి పూర్తిగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతు న్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. బొమ్మన హాళ్ మండలంలో తుఫాన్ ప్రభావంతో రైతులకు తీవ్ర నష్టం జరుగు తోంది. మంగళవారం రాత్రి నుంచి వర్షం కురుస్తూనే ఉంది. దీంతో మండ లంలో సాగు చేస్తున్న మిరప, మొక్కజొన్న, జొన్న పంటల మొక్కలు కుళ్లి పోతున్నాయి. ఉద్దేహాళ్, సిద్దరాంపురం, గోవిందవాడ, నేమకల్లు తదితర గ్రామాలలో పంటలకు తేమ శాతం ఎక్కువై మొక్కలు కుళ్లిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం రాత్రి 5.2 మి.మీ. వర్ష పాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

'కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం'

గుంతకల్లు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ చట్టాలను కేంద్రం అమలు పరచడానికి యత్నిస్తోందని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సురేశ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కార్యాలయంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సు ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు దుర్మార్గమైన చట్టాలను తెచ్చే యత్నంలో ఉంద న్నారు. ఆ చట్టాలను అడ్డుకోవడానికి ఐఎఫ్‌టీయూ దేశవ్యాప్త ఆందోళనలు చేట్టిందన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ పట్టణ అధ్యక్షుడు హను మంతు, నాయకులు రఘునాథరెడ్డి, జిలాన్, బాష, నారాయణ, విశ్వనాథ్, రామదాసు, గోపి, మస్తాన్ పాల్గొన్నారు.

జింకపిల్లను కాపాడిన గొర్రెల కాపరులు

కళ్యాణదుర్గంరూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పా ల్వాయి గ్రామ పరిసర ప్రాంతంలో గొర్రెల కాపరులు జింక పిల్లను కాపా డిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గొర్రెల కాపరులు మేత కోసం అటవీ ప్రాంతంలోకి వెళ్లారు. గొర్రెల కాపరుల వెంట వెళ్లిన కుక్కలు జింక పిల్లపై దాడికి యత్నించిన నేపథ్యంలో వాటి బారి నుంచి రక్షించి సచివా లయ సిబ్బందికి అప్పగించారు. సచివాలయ సిబ్బంది ఫారెస్టు అధికారు లకు సమాచారం ఇచ్చి అప్పగించారు.

ఇసుక తవ్వితే గ్రామానికి ముప్పే.

యల్లనూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చిత్రావతినదిలో అధికారులు సూచించిన ప్రదేశంలో ఇసుక తవ్వకాలు జరిపితే గ్రామానికి వరద ముప్పు తప్పదని చిలమకూరు గ్రామస్థులు జాయింట్ కలెక్టర్ శివనారా యణశర్మకు విన్నవించుకున్నారు. ప్రభుత్వ రీచ్ ఏర్పాటుకు మైనింగ్ అ ధికారులు ప్రయత్నాలు చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో బుధవారం జేసీ వచ్చారు. సర్పంచు నాగరాజు, గ్రామస్థులు మాట్లాడు తూ రెండు సంవత్సరాల క్రితం వరదనీరు గ్రామంలోకి ప్రవేశించడంతో భయభ్రాంతులకు గురయ్యామన్నారు. ఎత్తైన ఇసుకమేటలు తమ గ్రా మాన్ని కాపాడుతున్నాయని, వాటిలో తవ్వకాలు జరిపితే గ్రామంలోకి నీ రు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇసుకరీచ్ స్థల సేకరణ చేసేటప్పుడు గ్రామసభ ఎందుకు ఏర్పాటు చేయలేదంటూ అధికారులను ప్రశ్నించా రు. ఎంతచెప్పినా గ్రామస్థులు వినకపోవడంతో అధికారులు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామంటూ వెనుదిరిగారు.

వర్షానికి కూలిన మట్టిమిద్దె

పుట్లూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట గ్రా మంలో వర్షాలతో బుధవారం గోగుల హనుమంతుకు చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. కుటుంబ సభ్యులు పని నిమిత్తం బయటకు వెళ్లడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అక్కడున్న ఇంటి సామగ్రి దెబ్బతినింది. సుమారు రూ.20వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

హెచ్చెల్సీని ఆధునికీకరించాలి: సీపీఎం

ఉరవకొండ/బెళుగుప్ప/కళ్యాణదుర్గం/గుంతకల్లు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా రైతాంగానికి సాగు, తాగునీరును అందించే హెచ్చెల్సీని ఆధునికీకరించడమే ఏకైక మార్గమని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. సాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ పార్టీ ఆధ్వర్యంలో చేప ట్టిన బస్సు యాత్ర రెండో రోజు బుధవారం ఉరవకొండ, వజ్రకరూరు, బెళుగుప్పలో కొనసాగింది. ఉరవకొండ టవర్‌క్లాక్ కూడలిలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలు నిండినా జిల్లాకు నీరు రాకపోవడం బాధాకరమని తెలిపారు. జిల్లాలోని చెరువులు, కుంటలను నింపితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంద న్నారు. టీడీపీ కూటమి ఎన్నికల ముందు హెచ్చెల్సీని ఆధునికీకరణ చే స్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రకృతి వైపరీత్యాల వలన నష్ట పోయిన రైతులను ఆదుకోవాలన్నారు. సాగు, తాగునీటి సమస్యలను పరి ష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ 21న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు రంగయ్య, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, రంగారెడ్డి, జ్ఞానమూర్తి, మధుసూదన్, విరుపాక్షి, నాగముని పాల్గొన్నారు. బెళుగుప్ప మండలంలోని జీడిపల్లి రిజర్వాయరును పరిశీ లించారు. స్థానిక నాయకులు అచ్యుత ప్రసాద్, చంద్రశేఖర్, నాగమణి, కృష్ణమూర్తి, శ్రీనివాసులు పాల్గొన్నారు. కళ్యాణదుర్గం పట్టణంలో స్థానిక టీ సర్కిల్ వద్ద బస్సుయాత్రలో నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు అచ్యుత్‌ప్రసాద్, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, రంగనాథ్, రఘు తదితరులు పాల్గొన్నారు. సాగునీటిని అందించడం ద్వారా మాత్రమే కరువు నుంచి రాయలసీమకు విముక్తి లభిస్తుందని రాంభూపాల్ పేర్కొ న్నారు. గుంతకల్లులోని పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహి రంగ సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్